

చల్లపల్లి మేకలడొంక సమీపంలో నీటిలో నానుతున్న వరి



- పంటలపై మొంథా తుఫాను ప్రభావం
- నేలవాలిన వేలాది ఎకరాల వరి
- అన్నదాతలకు అపార నష్టం
- నీటిలో నాని మొలకెత్తుతున్న ధాన్యం
- కొనసాగుతున్న పంట పరిహారం అంచనాలు
- 33 శాతంపైన నష్టం జరిగితేనే సాయం
- నష్టం అంచనా పారదర్శకంగా వేయాలని వేడుకోలు

నష్టం.. కష్టం

అన్నదాతల ఆశలను మొంథా తుఫాను చిదిమేసింది. చేతికి అందివచ్చిన పంటను నీటిపాలు చేసింది. పంటలకు నష్టం కలిగించి రైతులను కష్టాల్లోకి నెట్టింది. రోజుల తరబడి వరి కంకులు నీటిలో నానడంతో మొలకలు వస్తున్నాయి. పంట నష్టం అంచనాలు వేసేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. 33 శాతంపైన నష్టం జరిగితేనే సాయం అందుతుందని చెబుతున్నారు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పారదర్శకంగా పరిహారం అంచనాలు సిద్ధం చేయాలని వేడుకుంటున్నారు. గతేడాది విధించిన నిబంధనలు సడలించి రైతులకు మేలు చేసేలా నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు. -(ఆంధ్రజ్యోతి - మచిలీపట్నం)

33 శాతం కన్నా అధికంగా నష్టం జరిగితేనే..

మొంథా తుఫాను ప్రభావంతో పంట 33 శాతం కన్నా అధికంగా దెబ్బతింటేనే నష్ట పరిహారం వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. అయితే గ్రామ స్థాయిలో గ్రామ వ్యవసాయ అధికారులు (వీఏఏలు), వీఆర్వోలు, పంట నష్టం అంచనా వేసే విధానంపైనే రైతులకు పరిహారం అందే అవకాశం ఉంది. కొందరు వ్యవసాయశాఖ సిబ్బంది పూర్తి స్థాయిలో పరిశీలించకుండా జాబితాలు సిద్ధం చేస్తున్నారు. వాటిని మండల, డివిజన్, జిల్లాస్థాయి వ్యవసాయశాఖ అధికారులు ఆమోదం తెలుపుతున్నారు. దీంతో వాస్తవంగా నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం అందని పరిస్థితి గతంలో జరిగింది. ఈ సారైనా పంట నష్టపరిహారం జాబితాలను సక్రమంగా తయారు చేయాలని రైతులు కోరుతున్నారు. గతంలో పెడన మండలంలో పంట నష్టపరిహారం తయారీ జాబితాలో అసలు భూమి లేని వారి పేరున నగదు జమ అయ్యేలా పెడన వ్యవసాయశాఖ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ తెరవెనుక చక్రం తిప్పాడు. రూ.3 కోట్ల వరకు నగదు పక్కదారి పట్టింది. దీనిపై అధికారులు విచారణ చేసినా, అసలు రైతులకు పంట నష్టపరిహారం మిగతా 6లో..

కొండంత భరోసా

రైతుల్లో ధైర్యం నింపిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



కోడూరు మండలం కృష్ణాపురంలో మొంథా తుఫాను ప్రభావంతో ఓ రైతు పొలంలో దెబ్బతిన్న వరి కంకులను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

మొంథా తుఫాను ప్రభావంతో తీవ్రంగా నష్టపోయిన దివిసీమ రైతులకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పర్యటన కొండంత భరోసా ఇచ్చింది. మోకాలి లోతు నీటితో ఉన్న పొలాల్లోకి దిగి వరి పంటలను పరిశీలించారు. పారదర్శకంగా పంట నష్టం అంచనాలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఆపద వేళ ప్రభుత్వం అండగా ఉంటుందని రైతులకు అభయమిచ్చారు. చల్లపల్లి మండలం మాజేరు నుంచి కోడూరు మండలం కృష్ణాపురం వరకు దారి పొడవునా రైతుల సమస్యలు తెలుసుకుంటూ ముందుకు సాగారు. దీర్ఘకాలిక సమస్యలను సైతం పరిష్కరించడానికి హామీ ఇచ్చారు. అన్నదాతల సంక్షేమమే తమ ధ్యేయమని పేర్కొన్నారు.



మొంథా తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న పంటలను పరిశీలించి, ఆ వివరాలను అవనిగడ్డలో మీడియాకు వెల్లడిస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, చిత్రంలో మంత్రులు వాసంశెట్టి సుభాష్, కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలశౌరి, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తదితరులు

- అవనిగడ్డ నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటన
- మోకాలి లోతు నీరు ఉన్న వరి పొలాల్లో దిగి పంటల పరిశీలన
- నష్టం అంచనాలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు
- ప్రభుత్వం అండగా ఉంటుందని రైతన్నలకు అభయం
- దారి పొడవునా సమస్యలు వింటూ సానుకూలంగా స్పందన
- దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ

అవనిగడ్డ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను కారణంగా దివి ప్రాంతంలోని ఆరు మండలాల్లోని వేలాది ఎకరాల్లో వరి, వాణిజ్య పంటలు దెబ్బతిన్నాయి. ప్రకాశం బ్యారేజీ దిగువన చిట్టచివరి ఆయకట్టు కావటంతో నాట్లు ఆలస్యంగా వేశారు. నాగాయలంక, కోడూరు, అవనిగడ్డ మండలాల్లో వరిపైరు బిగులు పొట్ట దశలో ఉండగా, ఎస్టేట్ మండలాలైన మోపిదేవి, చల్లపల్లి, ఘంటసాల మండలాల్లో ఈని, పాలు పోసుకునే దశలో వరి ఉంది. బలంగా వీచిన గాలులతో పొట్ట దశలో ఉన్న వరి చిలుకుపోయిందని, పైరు నేలవాలినప్పటికీ గాలుల ప్రభావంతో ఎక్కువగా ఈనిక రాక పంట దిగుబడి తగ్గిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు ఈనిక దశ, పాలు పోసుకునే దశలో ఉన్న పంట సింకు రాలిపోయి తాలు, తప్ప ఏర్పడే అవకాశం ఉంది. అధికారులు కేవలం



పడిపోయిన పొలాలను మాత్రమే నష్టం జరిగినట్లుగా అంచనా వేస్తుండగా, పవన్ కల్యాణ్ రైతులను నేరుగా కలవటంతో రైతులు తమకొచ్చిన కష్టాన్ని ఆయనకు నేరుగా చెప్పుకోగలిగారు. దీంతో పడిపోకుండా నిలువునా ఉన్న పంట పొలాల్లో ఏ మేరకు నష్టం వాటిల్లుతుందనే విషయమై అంచనా వేయాలని కలెక్టర్‌కు పవన్ సూచించగా, కలెక్టర్ బాలాజీ వ్యవసాయ శాఖాధికారులకు ఇలాంటి పొలాల విషయంలో కూడా అంచనాలు తయారు చేయాలని ఆదేశించటంతో రైతులు పవన్ కల్యాణ్ స్పందనతో కోల్పోయిన ధైర్యాన్ని తిరిగి పొందగలిగారు.

ప్రభుత్వం దృష్టికి కౌలు రైతుల సమస్య

ప్రకృతి వైపరీత్యాలు, విపత్తులు సంభవించిన సందర్భాల్లో అధికారులు పంట నష్టం అంచనా వేసి ఎవరి పేరుతో పొలం ఉందో వారికే పరిహారాన్ని అందజేస్తూ ఉంటారు. అయితే కృష్ణా జిల్లా వ్యాప్తంగా ముఖ్యంగా అవనిగడ్డ నియోజకవర్గంలో ఎక్కువ మంది కౌలుదారులు రైతుల వద్ద నుంచి పొలాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తుంటారు. ప్రభుత్వం రైతుకు మాత్రమే పరిహారం అందిస్తుండటంతో ఏటేట పెట్టుబడి పెట్టి శ్రమ చేసిన కౌలు రైతుల కష్టానికి ఎలాంటి ప్రతిఫలం లేకుండా ఉండటంతో కోడూరు మండలానికి చెందిన పలువురు కౌలు రైతులు పవన్ కల్యాణ్‌ను కలిసి వివరించారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు, ఎంపీ బాలశౌరిలు ఈ ప్రాంత కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించగా, సాగులో ఎంత మంది కౌలుదారులు ఉన్నారో గణాంకాలను వేయాలని పవన్ కల్యాణ్ కలెక్టర్‌కు సూచించి, కౌలు రైతుల సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇవ్వటంతో కౌలు రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

పవన్ దృష్టికి దీర్ఘకాలిక సమస్యలు

దివి ప్రాంత రైతులు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న పలు సమస్యలను జిల్లా అధికారులు పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లారు. సముద్రానికి మిగతా 6లో..

రైతన్నల బాధలు వింటూ ముందుకు..

ఉదయం 11.10 గంటల సమయానికి కోడూరు మండలం కృష్ణాపురం వెళ్లారు. అక్కడ రైతులను కలిసిన అనంతరం అవనిగడ్డ వచ్చేంత వరకు దారి పొడవునా తన కోసం ఎదురు చూస్తున్న రైతులను కలిసి వారి సమస్యలను సానుకూలంగా వినటంతో రైతుల్లో కూడా సంతృప్తి వ్యక్తమయింది. మొత్తం మీద ఉపముఖ్యమంత్రి పవన్ పర్యటన ఆసాంతం రైతుల్లో భరోసాను, నూతన ఉత్తేజాన్ని నింపింది.

రెవెన్యూ డివిజన్లు

- ఉమ్మడి కృష్ణా విభజన సమస్యలకు చెక్
- ఒక నియోజకవర్గం.. ఒక రెవెన్యూ డివిజన్‌తో పరిష్కారం
- ఒక రెవెన్యూ డివిజన్‌లో రెండు నియోజకవర్గాలతోనే సమస్య
- గన్నవరం, పెనమలూరును ఎన్టీఆర్ జిల్లాలో కలపాలని డిమాండ్
- కైకలూరు, ముదినేపల్లి, నూజివీడును కృష్ణాలో కలపాలని వినతులు
- ఉయ్యూరు, తిరువూరు రెవెన్యూ డివిజన్ల రద్దుతోనే వీటికి పరిష్కారం
- గన్నవరం, మైలవరం రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుతో మార్గం సుగమం
- నియోజకవర్గాలు, బహుళ డివిజన్లు, భౌగోళిక ఇబ్బందులూ తీరినట్టే..

ఒక నియోజకవర్గం ఒకే రెవెన్యూ డివిజన్‌లో ఉండాలన్న కూటమి ప్రభుత్వ నిర్ణయంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. పరిపాలనలో గందరగోళం లేకుండా చేయటం కోసం, నియోజకవర్గ ప్రజలకు కేంద్ర స్థానంగా ఉండటం కోసం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఆహ్వానించదగినదే. దీనివల్ల ఉమ్మడి కృష్ణాజిల్లాలోని మూడు నియోజకవర్గాల పరిధిలో తలెత్తిన గందరగోళాలను సరిచేయటంతో పాటు విభజిత జిల్లాల్లో విలీనం చేయాలన్న ప్రాంతాలను కలపటం కూడా తేలికవుతుంది. అదెలా అంటే..

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఉమ్మడి కృష్ణాజిల్లాను మచిలీపట్నం కేంద్రంగా కృష్ణాజిల్లాగా, విజయవాడ కేంద్రంగా ఎన్టీఆర్ జిల్లాగా గత వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అయితే, ఈ పునర్విభజనను గందరగోళంగా చేసింది. పార్లమెంట్ నియోజకవర్గాల ప్రాతిపదికన



కృష్ణా కొత్త మ్యాప్

చేపట్టిన విభజనతో అస్తవ్యస్త పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో తమ ప్రాంతాలను విజయవాడలో కలపాలన్న డిమాండ్లు వస్తూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రజల సమస్యలను సరి చేసేందుకు కూటమి ప్రభుత్వం నడుంబిగించింది.

ప్రస్తుత రెవెన్యూ డివిజన్ల గందరగోళం ఇలా..

- ఎన్టీఆర్ జిల్లాలోని మైలవరం నియోజకవర్గంలో ఇబ్రహీంపట్నం, జి.కొండూరు, విజయవాడ రూరల్ (5 గ్రామాలు), మైలవరం, రెడ్డిగూడెం మండలాలు ఉన్నాయి. వీటిలో మైలవరం, జి.కొండూరు, ఇబ్రహీంపట్నం, విజయవాడ రూరల్ మండలాలు విజయవాడ డివిజన్ పరిధిలో ఉండగా, ఒక్క రెడ్డిగూడెం మండలం తిరువూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉంది.
- కృష్ణాజిల్లాలోని గన్నవరం, పామర్రు నియోజకవర్గాలు రెండేసి రెవెన్యూ డివిజన్ల పరిధిలో ఉన్నాయి. గన్నవరం నియోజకవర్గంలో గన్నవరం, బాపులపాడు, ఉంగుటూరు, విజయవాడ రూరల్ మండలాలు (9 గ్రామాలు) ఉన్నాయి. గన్నవరం, బాపులపాడు, ఉంగుటూరు మండలాలు గుడివాడ రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉన్నాయి. విజయవాడ రూరల్ మండలం (9 గ్రామాలు) మాత్రం విజయవాడ రెవెన్యూ డివిజన్ పరిధిలోనిది. అలాగే, పామర్రు నియోజకవర్గంలో తోట్లవల్లూరు, పమిడిముక్కల, పామర్రు, మొవ్వ, పెదపారుపూడి మండలాలు ఉన్నాయి. వీటిలో తోట్లవల్లూరు, పమిడిముక్కల, పామర్రు, మొవ్వ మండలాలు ఉయ్యూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉన్నాయి. ఒక్క పెదపారుపూడి మండలం మాత్రం గుడివాడ రెవెన్యూ డివిజన్ పరిధిలోకి వస్తుంది.

సమస్యలు ఇలా..

గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాలను ఎన్టీఆర్ జిల్లాలో విలీనం చేయాలన్నది ప్రజల డిమాండ్. దీనిపై ఇటీవల మంత్రుల కమిటీకి కూడా ప్రతిపాదనలు అందాయి. విజయవాడ విమానాశ్రయం గన్నవరంలో ఉంది. కానీ, గన్నవరం ప్రాంతం కృష్ణాజిల్లా పరిధిలో ఉంటుంది. దీంతో కృష్ణాజిల్లా కలెక్టరేట్ నుంచి కానీ, ఉయ్యూరు నుంచి కానీ ప్రొటోకాల్ విధుల కోసం రావాల్సి వస్తోంది. అలాగే, కైకలూరు, ముదినేపల్లి, నూజివీడును కృష్ణాజిల్లాలో కలపాలనే డిమాండ్ ఎప్పటినుంచో వస్తోంది. నూజివీడును కృష్ణాజిల్లాలో కలుపుతానని ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా హామీ మిగతా 6లో..

కుమార్తె పెళ్లి పత్రికలు పంచుతూ అనంతలోకాలకు..

- పెడన మండలం బల్లిపర్రు వద్ద రోడ్డు ప్రమాదం
- మచిలీపట్నం బలరామునిపేటకు చెందిన వ్యక్తి మృతి
- నవంబరు 13న కుమార్తె వివాహం
- పెళ్లికి బంధువులను ఆహ్వానించేందుకు కలిదిండి వెళ్తుండగా ఘటన
- కన్నీరుమున్నీరవుతున్న కుటుంబం



జయవీరప్రతాప్(ఫైల్)

మరో పద్నాలుగు రోజుల్లో కుమార్తె పెళ్లి.. అందరూ ఆయా పనుల్లో బిజీగా ఉన్నారు. బంధువులను ఆహ్వానించే బాధ్యతను ఇంటి పెద్ద అయిన తండ్రి తీసుకున్నాడు. పెళ్లి పత్రికలు పంచేందుకు తమ్ముడుతో కలిసి ఉదయమే కలిదిండి బయలుదేరాడు. మరో బైక్ రూపంలో వచ్చిన మృత్యువు కబళించింది. పెళ్లి ఇంటి తీవ్ర విషాదం నింపింది.

పెడన/మచిలీపట్నం టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పెడన మండలం బల్లిపర్రు గ్రామంలోని రైస్‌మిల్లు వద్ద జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మచిలీపట్నం నగరంలోని బలరామునిపేటకు చెందిన మాదిరెడ్డి జయవీరప్రతాప్ (60) మృతి చెందాడు. నవంబరు 13న జరగనున్న తన కుమార్తె వివాహానికి బంధువులను ఆహ్వానించేందుకు జయవీరప్రతాప్ తన తమ్ముడు వీరాంజనేయులుతో కలిసి గురువారం ఉదయం ద్విచక్ర వాహనంపై కలిదిండి మండలం పెదలంక బయలుదేరాడు. మార్గమధ్యంలోని బల్లిపర్రు రైస్ మిల్లు వద్ద జయవీరప్రతాప్ నడుపుతున్న ద్విచక్ర వాహనాన్ని వెనుక వైపు నుంచి వస్తున్న చిలుకోటి సుబ్బారావుకు చెందిన ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో జయవీరప్రతాప్ రోడ్డుపై పడిపోయాడు. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయన మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బందరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, ద్విచక్ర వాహనంపై వెనుక వైపు కూర్చున్న జయవీరప్రతాప్ తమ్ముడు వీరాంజనేయులుకు స్వల్ప గాయాలయ్యాయి. ఎస్ఐ జి.సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జయవీరప్రతాప్ మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. బలరామునిపేటలో జయవీరప్రతాప్ బంధువులు, స్నేహితులు పెద్ద ఎత్తున తరలివచ్చి భౌతిక కాయం వద్ద నివాళులర్పించారు. కాగా, మాదిరెడ్డి జయవీరప్రతాప్ రోల్డుగోల్డు నగలు తయారు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈయనకు భార్య రత్నకుమారి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరిని బాగా చదివించాడు. పెద్ద కుమార్తె మోహితకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగితో వివాహం నిశ్చయించారు. చిన్నకుమార్తె దివ్య కేరళలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తుంది.



రైతులూ.. ఆందోళన వద్దు

- పెనమలూరు, పామర్రు నియోజక వర్గాల్లో మంత్రి అచ్చెన్నాయుడు పర్యటన
- ఎమ్మెల్యేలతో కలిసి పంటల పరిశీలన

8

మునేరు మహోగ్రం

మొంథా తుఫాను గండం వీడిందంటే.. మునేరు వరద ముంపు జిల్లాపై పడగవిప్పింది. తెలంగాణాలో వర్షాల కారణంగా మునేరు మహోధృతమై ప్రవహిస్తోంది. వేలాది ఎకరాల పంటలు ముంపునకు గురయ్యాయి. గ్రామాలు వరద నీటిలో చిక్కుకున్నాయి. వత్సవాయి మండలం పోలంపల్లి ఆనకట్ట వద్ద నీటిమట్టం 15 అడుగులకు చేరింది. లింగాల కాజ్‌వేను వరద ముంచెత్తింది. దీంతో ఈ మార్గంలో తెలంగాణాకు రాకపోకలు నిలిచిపోయాయి. పెనుగంచిప్రోలు వంతెనపై కూడా అడుగు ఎత్తున వరద ప్రవహిస్తుండటంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని సమీప గ్రామాలవారు భయాందోళన చెందుతున్నారు. పాలేరు, వైరా, కట్టలేరు కూడా ఉగ్రరూపం దాల్చాయి.

- తెలంగాణ నుంచి భారీగా వరద
- వందల ఎకరాల్లో పంటలు మునక
- నీటిలో చిక్కుకుపోయిన గ్రామాలు
- బాధితులు పునరావాస కేంద్రాలకు తరలింపు
- జలదిగ్బంధంలోనే కాజ్‌వేలు
- ఏపీ-తెలంగాణ మధ్య రాకపోకలు బంద్



అనాసాగరం వద్ద వరద ఉధృతి

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/ కంచికచర్ల/ వత్సవాయి/ పెనుగంచిప్రోలు) : మొంథా తుఫాను వల్ల తెలంగాణాలోని వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు పడటంతో మునేరుకు వరద చేరింది. ప్రస్తుతం 1.65 లక్షల క్యూసెక్కుల వరద వస్తోంది. ఈ ప్రవాహం శుక్రవారానికి తగ్గుముఖం పట్టవచ్చని జలవనరుల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. వరంగల్ జిల్లా మిగతా 6లో..

ఇంద్ర బస్సుకు తప్పిన ప్రమాదం

8



పాతమాజేరులో పవన్‌కు తమ గోడు వివరిస్తున్న రైతులు

పాతమాజేరులో పవన్‌కు రైతుల వినతులు

చల్లపల్లి/అవనిగడ్డ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : దివిసీమ పర్యటన ముగించుకుని తిరిగివెళుతున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు చల్లపల్లి మండలం పాత మాజేరులో రైతులు వరి కంకులతో స్వాగతం పలికారు. తుఫాను ప్రభావంతో పాలుపోసుకునే దశలో ఉన్న వరిపంట దెబ్బతిందనీ, గాలులకు కంకులు రాలిపోయాయని ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేయగా.. బాధితులందరినీ ప్రభుత్వం ఆదుకుంటుందని వారికి భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రితో కరచాలనం చేసేందుకు, సెల్ఫీలు దిగేందుకు మహిళలు, యువత ఉత్సాహం చూపారు.



పులిగడ్డలో రోడ్డు సైడ్ వ్యాపారులతో మాట్లాడుతున్న పవన్ కల్యాణ్

ప్రజలను పలకరిస్తూ.. పవన్ కల్యాణ్ పర్యటన

అవనిగడ్డ రూరల్ : తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటనకు వచ్చిన పవన్ కల్యాణ్ పులిగడ్డలో మానవత్వం చాటుకున్నారు. పులిగడ్డలో వృద్ధుడు పెద్ది వెంకటేశ్వరావు ఇల్లు పూర్తిగా దెబ్బతినగా, పరిశీలించిన ఆయన వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గ్రామానికి చెందిన మహిళ గొర్రె నాగసూరి భర్తను కోల్పోయి కుటుంబపోషణ కోసం పడుతున్న ఇబ్బందుల గురించి వివరించగా, వారి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పవన్ కళ్యాణ్‌కు అవనిగడ్డ నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు దివి ప్రాంత రైతుల సమస్యలు వివరించారు.



అడుగడుగునా ఆంక్షలు..



అవనిగడ్డ/కోడూరు : పవన్ కల్యాణ్ దివిసీమ పర్యటన సందర్భంగా పోలీసుల ఆంక్షలతో రైతులు, ప్రజాప్రతినిధులు, సామాన్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉదయం 8.30 గంటల నుంచే అవనిగడ్డ-కోడూరు రహదారిపై రాకపోకలను అధికారులు పూర్తిగా నిలిపివేశారు. మందపాకల మీదుగా నాగాయలంక వచ్చి అటు నుంచి అవనిగడ్డకు ట్రాఫిక్ మళ్లించటంతో ప్రజలు దాదాపు 14 కిలోమీటర్లకు పైగా దూరం ప్రయాణించాల్సి వచ్చింది. కూటమి నేతలను కూడా పోలీసులు అనుమతించకపోవటంతో తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. తీరగ్రామాల్లో పెద్ద ఎత్తున పంట నష్టం వాటిల్లిందని, అయినా రోడ్డు పక్కన పొలానికి వచ్చి వెళ్లిపోవటంలో ఆంతర్యమేమిటని మహిళలు మీడియాఎదుట ఆగ్రహం వ్యక్తం చేశారు. పొలాలను పరిశీలించేందుకు డిప్యూటీ సీఎం కోడూరు వస్తున్నారని, కొండంత ఆశతో ఎదురుచూశామని, కానీ పోలీసు అధికారులు అనుమతించకపోవటంతో తీవ్ర ఆక్రోశాన్ని వ్యక్తం చేశారు.



పుట్టలో పాలుపోసి పూజలు చేస్తున్న పవన్ కల్యాణ్

సుబ్రహ్మణ్యేశ్వరుని సేవలో పవన్ కల్యాణ్

మోపిదేవి : ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌లు మోపిదేవిలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, పార్టీ నాయకులు వారికి ఘన స్వాగతం పలకగా.. నాగపుట్టలో పాలుపోసి స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. అర్చక బృందం వేదమంత్రాలతో ఆశీర్వచనం పలికి నూతన వస్త్రాలు, శేషవస్త్రాలతో వారిని సత్కరించారు.

స్వచ్ఛ చల్లపల్లికి రావాలంటూ డిప్యూటీ సీఎంకు ఆహ్వానం

చల్లపల్లి : దివిసీమ పర్యటనకు వచ్చిన పవన్ కల్యాణ్‌ను స్వచ్ఛ చల్లపల్లి రథసారధులు డాక్టర్ డీఆర్కే ప్రసాద్ దంపతులు మోపిదేవిలో మర్యాదపూర్వకంగా కలిశారు. 11 సంవత్సరాలుగా గ్రామంలో జరుగుతున్న స్వచ్ఛ సుందర చల్లపల్లి సేవలను తెలియచేశారు. ఒకసారి చల్లపల్లి గ్రామాన్ని సందర్శించాలంటూ ఆహ్వానపత్రాన్ని అందజేశారు. దీనికి డిప్యూటీ సీఎం సానుకూలంగా స్పందించారు.



పెదయాదరలో పర్యటించిన మంత్రి కొల్లు రవీంద్ర

రైతులను ఆదుకుంటాం : మంత్రి రవీంద్ర

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాను వల్ల పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటామని ఎక్సైజ్ శాఖామంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. గురువారం బందరుమండలం బోగిరెడ్డిపల్లి, పెదయాదర తదితర గ్రామాల్లో మాజీ ఎంపీపీ, రూరల్ టీడీపీ మండలం అధ్యక్షుడు కాగిత వెంకటేశ్వరరావు, గొర్రెపాటి గోపీచంద్, మాజీ జడ్పీటీసీ లంకే నారాయణ ప్రసాద్‌లతో కలిసి మంత్రి పర్యటించారు. భారీవర్షాలకు ముంపునకు గురైన పొలాలను రవీంద్ర సందర్శించారు. మొలకెత్తిన వరి కంకులను మంత్రికి రైతులు చూపించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పూర్తిస్థాయిలో సర్వే జరిపిన అనంతరం నష్టపోయిన రైతులను అన్ని విధాల ఆదుకుంటామన్నారు. ఈ భారీ నష్టాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్ళేందుకు చంద్రబాబు కృతనిశ్చయంతో ఉన్నారన్నారు.

మొంథాను సమర్థంగా ఎదుర్కొన్నాం

- ముందుచూపుతో తప్పిన తీవ్ర ముప్పు
- తెలంగాణలో వర్షాలతోనే మునేరుకు వరద
- ఇన్చార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్

కంచికచర్లరూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాను వల్ల రాష్ట్రంలో భారీస్థాయిలో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చంద్రబాబు న్యాయకత్వంలో కూటమి ప్రభుత్వం సమర్ధవంతంగా ఎదుర్కొన్నట్టు జిల్లా ఇన్చార్జ్ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ఎగువ ప్రాంతం తెలంగాణాలో కురిసిన భారీ వర్షాలకు మున్నేరుకు భారీగా వరద నీరు చేరుతుండటంతో గురువారం సాయంత్రం సత్యకుమార్, స్థానిక ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, ఎంపీ కేశినేని శివనాథ్, మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ తాతయ్యలతో కలిసి కంచికచర్ల మండలం కీసర బ్రిడ్జి వద్ద మున్నేరు వరద ప్రవాహాన్ని అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ, మొంథా తుఫాను తీవ్రత దృష్ట్యా భారీ స్థాయిలో ప్రాణ, ఆస్తి నష్టం జరిగే అవకాశం ఉందని ముందుగానే ప్రభుత్వం గ్రహించిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, తుఫానుకు వారం రోజుల ముందు నుంచే అధికార యాంత్రంగాన్ని అప్రమత్తం చేయడంతో ప్రాణ, ఆస్తి నష్టం నివారించగలిగమన్నారు. ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో మంత్రులు, ఎమ్మెల్యేలతో పాటు గ్రామస్థాయిలో సచివాలయ సిబ్బంది నుంచి రాష్ట్రస్థాయి అధికారులను అప్రమత్తం చేసి తుఫాను ధాటికి ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించి సమర్ధవంతంగా ఎదుర్కొన్నామన్నారు. తెలంగాణా ప్రాంతంలో కురిసిన భారీవర్షాలకు ఖమ్మం వరంగల్, ప్రాంతాల నుంచి మున్నేరుకు అనూహ్యంగా వరద పెరిగి పెనుగంచిప్రోలు, వత్సవాయి, నందిగామ, కంచికచర్ల మండలాలలో తీర గ్రామాలను ముంచెత్తుతున్నదన్నారు. ప్రజలను కాపాడేందుకు జిల్లా అధికార యాంత్రంగాన్ని అప్రమత్తం చేశామన్నారు. పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలం లింగాల వద్ద కాజ్వేపై వరద ప్రవహించి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయన్నారు. నష్టం తీవ్రతను క్షేత్ర స్థాయిలో పరిశీలించి వివరాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తామన్నారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ సీపీ రాజశేఖర్‌బాబు, నందిగామ ఆర్డీవో కె.బాలకృష్ణ, ఏసీపీ తిలక్, సీఐ చవాన్, ఏఎంసీ చైర్మన్ కోగంటి బాబు, తహసీల్దార్ నరసింహారావు, దేశం పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్, పక్కన ఎంపీ కేశినేని చిన్ని, సౌమ్య

కమ్యూనిటీ భవనానికి నిధులు కేటాయించండి

- మంత్రి సత్యకుమార్‌కు వసంత వినతి

నందిగామ : బీసీ జనాభా అధికంగా ఉన్న ఐతవరం గ్రామంలో కమ్యూనిటీ భవనం నిర్మాణానికి నిధులు కేటాయించాలని మాజీ మంత్రి వసంత నాగేశ్వరరావు జిల్లా ఇన్‌చార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కోరారు. గురువారం తుఫాను పర్యటనలో భాగంగా ఐతవరం వచ్చిన మంత్రి సత్యకుమార్ ఎంపీ కేశినేని చిన్ని, ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య, ఎమ్మెల్యేలు వసంత కృష్ణప్రసాద్, శ్రీరామ్ రాజగోపాల్ తదితరులు వసంత నివాసానికి వచ్చారు. ఈసందర్భంగా తుఫాను ప్రభావంపై చర్చించారు. ఈసందర్భంగా వసంత మాట్లాడుతూ, తమ గ్రామంలో బీసీలు అధికంగా ఉన్నారని, వారి అవసరాల కోసం నిధులు కేటాయించాలని మంత్రిని కోరారు.



తుఫాను ప్రభావంపై చర్చిస్తున్న నేతలు

నష్టం..కష్టం

(5వ పేజీ తరువాయి)

అందనేలేదు. ఈ ఏడాది ఇలాంటి పరిస్థితి ఏ మండలంలోనూ తలెత్తకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

ఎకరానికి 40 టిక్కీలే కొనుగోలు చేస్తారా!

పంట నష్టపరిహారం అంచనాల తయారీ ప్రస్తుతం జరుగుతోంది. ఈ జాబితాలు తయారు చేసే సమయంలో అధికారులు మెలికపెడుతున్నారు. పంటకు ఎలాంటి నష్టం జరగకుంటే ఎకరానికి 70 టిక్కీలు (ఒక టిక్కీ 40 కిలోలు) వరకు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తుంది. పంట నష్టం జరిగినట్లుగా ఆన్‌లైన్‌లో రైతుల పేర్లు నమోదు చేస్తే ఎకరానికి 40 టిక్కీలు మాత్రమే కొనుగోలు చేసేలా నిబంధనలు ఉన్నాయని వ్యవసాయ, రెవెన్యూ విభాగాల అధికారులు చెబుతున్నారు. వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు కంకిపాడు మండలం పునాదిపాడు తదితర గ్రామాల్లో పర్యటనకు గురువారం వచ్చిన సమయంలో ఈ అంశంలో వెసులుబాటు ఇవ్వాలని కోరేందుకు ప్రయత్నించారు. కలిసేందుకు అవకాశం రాకపోవడంతో మంత్రికి ఈ విషయం చెప్పలేకపోయామని పలువురు రైతులు అంటున్నారు. ఈ తరహా నిబంధనను గతేడాది పాటించారని, ఈ ఏడాది ఈ నిబంధనను సడలించాలని రైతులు కోరుతున్నారు.

ఎకరానికి రూ.35వేల వరకు పెట్టుబడి

వరి కోతకు సిద్ధమైన దశ వరకు ఎకరానికి కనీసంగా రూ.30 వేల నుంచి రూ.35 వేల వరకు పెట్టుబడిగా పెట్టామని రైతులు చెబుతున్నారు. తుఫాను ప్రభావంతో భారీ వర్షం, బలమైన గాలులు వీయడంతో పంట పూర్తిస్థాయిలో దెబ్బతిందని అంటున్నారు. ఈ ఏడాది జిల్లాలో 1.60 లక్షల హెక్టార్లలో వరి సాగు జరిగింది. 1.20 లక్షల హెక్టార్లలో వరి పంట కంకులు ఈని పాలు పోసుకునే దశలో ఉన్నాయి. మరికొన్ని చోట్ల నవంబరు మొదటి వారంలో కోత కోసేందుకు రైతులు సమాయత్తమవుతున్నారు.

46,357 హెక్టార్లలో పంటలకు నష్టం

జిల్లాలో మొంథా తుపాను కారణంగా వరికి తీవ్ర నష్టం వాటిల్లింది. వరి పంట సుమారు 45,000 హెక్టార్లలో, మినుము 985 హెక్టార్లు, వేరుశనగ 288 హెక్టార్లు, పత్తి 48 హెక్టార్లు, మొత్తంగా 46,357 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. అలాగే ఉద్యాన పంటలకు సంబంధించి అవనిగడ్డ, చల్లపల్లి, ఘంటసాల, మొవ్వ, తోట్లవల్లూరు, పమిడిముక్కల, పామర్రు, పెడన మంగలాల్లో తదితర ప్రాంతాల్లో 2,229 మంది రైతులకు చెందిన 1,416.22 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారు. ఉద్యాన పంటలకు, రూ.73.45 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లుగా అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. క్షేత్రస్థాయి సర్వే తర్వాత పంటనష్టం పెరగడం లేదా తగ్గడం జరుగుతుందని వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు.

15 ఎకరాల్లో నష్టపోయాం

- గంజాల గోపీకృష్ణ, హుస్సేన్‌పాలెం



మచిలీపట్నం, గూడూరు మండలాల పరిధిలో మా కుంటుబానికి 15 ఎకరాల పొలం ఉంది. స్వర్ణ సంపద రకం వరి వంగడం సాగుచేశాం. పంట కోతకు సిద్ధం కావడంతో మిషన్ తీసుకువచ్చి ఎకరం భూమి కోయించాం. ఇంతలో తుపాను రావడంతో వరి కోతను ఆపేశాం. దీంతో వరి నేల వాలింది. కంకులపై నీరు చేరడంతో మొలకెత్తుతున్నాయి. ఎంతమేర దిగుబడి తగ్గుతుందో అంతుచిక్కడం లేదు. ఇప్పటివరకు రూ.4.50 లక్షలకుపైగా పెట్టుబడిగా పెట్టాం. ప్రభుత్వం ఆదుకోవాలి.

ప్రభుత్వం ఆదుకోవాలి

-పూల శివనాగేంద్ర, హుస్సేన్‌పాలెం



మూడు ఎకరాల్లో స్వర్ణ సంపద వరి వంగడం సాగు చేశా. ఎకరానికి కనీసంగా 35 బస్తాల దిగుబడి వస్తుందని ఆశించా. కోతకు సిద్ధపడిన దశలో తుపాను రూపంలో విపత్తు ముంచుకొచ్చింది. పంట మొత్తం నేలావాలింది, కంకులు రెండు, మూడు రోజులుగా నీటిలోనే ఉండటంతో మొలకెత్తుతున్నాయి. పెట్టుబడి కూడా రాదనే భయం వెంటాడుతోంది. ప్రభుత్వం జరిగిన నష్టాన్ని గుర్తించి రైతులను పూర్తిస్థాయిలో ఆదుకోవాలి.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆస్టర్ పోతిన రమేశ్‌బాబు

రాయితీతో వైద్యపరీక్షలు

- ఆస్టర్ రమేశ్ ఎండీ డాక్టర్ పోతినేని రమేశ్‌బాబు

విజయవాడ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : స్ట్రోక్ పేషెంట్లకు సత్వర వైద్యచికిత్సను అందించడానికి ఏడాది పాటు 50 వేలమంది రోగులకు ఆస్టర్ రమేశ్ ఆసుపత్రి అన్ని శాఖలు, 26 అవుట్ రీచ్ సెంటర్ల ద్వారా ప్రతిరోజు ఐదుగురు పేషెంట్లకు ఉచిత కన్సల్టేషన్, రాయితీతో వైద్యపరీక్షలు నిర్వహిస్తామని ఆసుపత్రి ఎండీ డాక్టర్ పోతినేని రమేశ్‌బాబుతెలిపారు. నగరంలోని ఆస్టర్ రమేశ్ ఆసుపత్రిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, స్ట్రోక్ అనేది అకస్మాత్తుగా జరిగే అత్యవసర వైద్య పరిస్థితి అని, ప్రతి నిమిషం విలువైనదన్నారు. సమయానికి సరైన ఆసుపత్రికి చేరితే మెదడులో మరణించే కణాలను రక్షించవచ్చన్నారు. ప్రజల్లో అవగాహన పెరిగి గోల్డెన్ అవర్లో చికిత్స అందించగలిగితే చాలామంది రోగులు తిరిగి సాధారణ జీవితం పొందుతారని ఆయన పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం సుమారు 18 లక్షల కొత్త స్ట్రోక్ కేసులు నమోదవుతున్నాయని, ప్రతి ఆరు సెకన్లకు ఒక వ్యక్తి స్ట్రోక్‌కు గురవుతున్నారని వెల్లడించారు. 40 ఏళ్లలోపు యువకుల్లో 25శాతం కేసులు నమోదవుతున్నాయన్నారు. అధిక రక్తపోటు, మధుమేహం, ధూమపానం, అధికబరువు అదుపులో ఉంచుకుంటే 90శాతం స్ట్రోక్‌లను నివారించవచ్చన్నారు. స్ట్రోక్ కనిపించిన నాలుగున్నర గంటల్లో చికిత్స పొందితే 80 శాతం మంది పూర్తిగా కొలుకోవచ్చని రమేశ్‌బాబు చెప్పారు. స్ట్రోక్ అనేది మెదడుకు రక్తప్రవాహం ఆకస్మాత్తుగా ఆగిపోవడం లేదా రక్తనాళం చిట్లిపోవడం వల్ల మెదడులో కణజాలం దెబ్బతినడం వల్ల ఏర్పడుతుందన్నారు. గుండె జబ్బుల తర్వాత ప్రపంచ వ్యాప్తంగా మరణానికి రెండో ప్రధాన కారణమని తెలిపారు.



మాట్లాడుతున్న డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ బైరా కోటేశ్వరరావు

దళితులపై పెరుగుతున్న లైంగిక దాడులు

- డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ బైరా కోటేశ్వరరావు

గవర్నర్‌పేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : చట్టం పటిష్టంగా అమలు పర్చడం అందరి కర్తవ్యమని డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ బైరా కోటేశ్వరరావు అన్నారు. దళిత స్త్రీ శక్తి సంస్థ ఆధ్వర్యంలో గురువారం స్థానిక హోటల్‌లో దళిత, ఆదివాసీ స్త్రీలు, బాలికలపై జరుగుతున్న హింసకు సంబంధించి బాధితులు, సాక్షులతో లీగల్ క్లీనిక్ నిర్వహించారు. జ్యూరీ సభ్యులుగా సీఐడీ పీసీఆర్ కె.శ్రీనివాస్, ఎస్సీ కార్పొరేషన్ చైర్‌పర్సన్ విజయకుమార్, మాజీ ఇన్ఫర్మేషన్ కమిషనర్ అంబటి సుబ్బారావు, ఎస్సీ అసోసియేషన్ సెక్రటరీ రత్నప్రదీప్, హైకోర్టు అడ్వకేట్ అభిజ్ఞలు ఉన్నారు. క్లీనిక్‌కు దళిత స్త్రీ శక్తి సంస్థ జాతీయ కన్వీనర్ ఝాన్సీ గెడ్డం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బైరా మాట్లాడుతూ, బలమైన చట్టం ఉన్నప్పటికీ దళితులు, ఆదివాసీల స్త్రీలు, బాలికలపై అత్యాచారాలు, లైంగిక దాడులు, హత్యలు వంటి సంఘటనలు జరగడం దురదృష్టకరమని అన్నారు. చట్టం పటిష్టంగా అమలు పర్చడంలో కర్తవ్యం బలంగా ఉండాలన్నారు. బాధితులకు రావలసిన రాయితీలను సోషల్ వెల్ఫేర్ మంత్రితో మాట్లాడి సదుపాయం కలిగేట్టు చూస్తామని హామీ ఇచ్చారు. క్లీనిక్‌లో దళిత, ఆదివాసీ స్త్రీలు, బాలికలపై జరిగిన హింసా సంఘటనలను, 33 కేసులను జ్యూరీ సభ్యుల ముందుంచారు. దళిత స్త్రీ శక్తి నేషనల్ కో-ఆర్డినేటర్ ప్రతి కేసుకూ సమన్వయకర్తగా జ్యూరీకి వివరించారు. జ్యూరీ సభ్యులు స్పందిస్తూ బాధితులకు నష్టపరిహారం కోసం కృషి చేస్తామన్నారు.

మునేరు మహోగ్రం

(5వ పేజీ తరువాయి)

పాకాలలో పుట్టిన మునేరు 240 కిలోమీటర్లు ప్రవహించి ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడు మండలంలో కృష్ణానదిలో కలుస్తుంది. ఇది వరంగల్, ఖమ్మ జిల్లాల మీదుగా ప్రవహిస్తుంది. ఖమ్మం జిల్లాలో పుట్టిన కట్టలేరు వాగు.. వైరా వాగులో కలుస్తుంది. అక్కడి వైరా వాగు వచ్చి మునేరులో కలుస్తుంది. మహబూబాబాద్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్ జిల్లాల్లో గురువారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 3.30 గంటల మధ్యలో మునేరు పరిధిలో 277.56 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ నీరు మొత్తం మునేరులోకి వస్తోంది. ఈ ఏరుకు 2005లో రికార్డు స్థాయిలో 3.47 లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది. గత ఏడాది 3.10 లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది. ఉదయం నుంచి నీటిమట్టం పెరుగుతుండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. మునేరు వాగు మీదుగా తెలంగాణాకు ఉన్న మార్గాలను మూసివేశారు. గురువారం ఉదయం 9 గంటలకు కలవోడు వద్ద 24.50 అడుగులకు నీటిమట్టం చేరింది. కీసర వద్ద సాయంత్రం 4 గంటలకు 25.50 అడుగులకు నీటిమట్టం చేరింది.

పాలేరుపై 79.59 సెంటీమీటర్లు

ఒకపక్క మునేరు ఉప్పొంగుతుండగా, మరోపక్క పాలేరు పరవళ్లు తొక్కుతోంది. జనగాం జిల్లా నుంచి ప్రారంభమయ్యే పాలేరు మహబూబబాద్, ఖమ్మం, సూర్యాపేట జిల్లాల మీదుగా ప్రవహించి జగ్గయ్యపేట మండలం ముక్త్యాల వద్ద కృష్ణానదిలో కలుస్తుంది. పాలేరు పరిధిలో 79.59 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ వాగులన్నీ కృష్ణానదిలో కలవడంతో ఆ వరద ప్రభావం ప్రకాశం బ్యారేజీపై పడుతోంది. పోలంపల్లి ఆనకట్ట వద్ద గంటగంటకూ ఉధృతి పెరుగుతూనే ఉంది. కృష్ణానదికి కూడా వరద వస్తుండటంతో ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధమైంది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్, కలెక్టర్ లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ రాజశేఖర్‌బాబు, ఎమ్మెల్యేలు తంగిరాల సౌమ్య, శ్రీరాం తాతయ్య, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురామ్ తదితరులు కీసర, పెనుగంచిప్రోలు, లింగాల, పోలంపల్లి తదితర ప్రాంతాల్లో పర్యటించి వరద ఉధృతిని పరిశీలించారు.

జలదిగ్బంధంలో కాజ్‌వేలు

చిల్లకల్లు-వైరా అంతర్రాష్ట్ర రహదారిలోని లింగాల కాజ్‌వే వరద దిగ్బంధానికి గురైంది. ఈ కాజ్‌వేపై ఆరేడు అడుగుల ఎత్తున వరద పొంగుతోంది. బుధవారం రాత్రి 8 గంటల నుంచి అధికారులు ఈ కాజ్‌వేను మూసివేశారు. రెవెన్యూ, పోలీస్ సిబ్బంది కాజ్‌వే రెండువైపులా పహారా కాస్తున్నారు. అంతర్రాష్ట్ర రహదారిపై పూర్తిగా రాకపోకలు నిలిచి 24 గంటలు దాటింది. రెండువైపులా వందల సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. పెనుగంచిప్రోలు వంతెనపై ఉదయం నుంచి రాకపోకలు నిలిచిపోయాయి. ఒక అడుగు ఎత్తున వరద ప్రవహిస్తోంది. ముందు జాగ్రత్తగా అధికారులు వంతెనను మూసివేశారు.

జాతీయ రహదారిపైకి చేరుతుందా?

మునేరు ఉగ్రరూపం దాల్చడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గురువారం రాత్రికి భారీగా వరద పెరిగే అవకాశం ఉందన్న సమాచారం వారిని కలవరపాటుకు గురిచేస్తోంది. వరద ఇంకా పెరిగితే ఎన్‌హెచ్-65పైకి నీరు చేరే అవకాశం ఉంటుంది. ఇదే జరిగితే హైదరాబాద్-విజయవాడ ప్రధాన మార్గంలో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తే అవకాశాలు ఉన్నాయి.

కొండంత భరోసా

(5వ పేజీ తరువాయి)

చేరువలో ఉండే దివి ప్రాంతంలో సముద్రపు పోటు నీరు మరమ్మతుకు గురైన అవుట్ ఫాల్స్ స్లూయిస్ గేట్ల ద్వారా పంట పొలాల్లోకి చొచ్చుకు వచ్చి భూములు క్షారమయం కావటంతోపాటు పంట దెబ్బతినే పరిస్థితి ఎన్నో ఏళ్లుగా కొనసాగుతుంది. కోడూరు, నాగాయలంక మండలాల్లో ఇలాంటి అవుట్ ఫాల్ స్లూయిస్‌లు దాదాపు ఏడు, ఎనిమిది ఉండగా, కోడూరు మండలంలో రత్నకోడు అవుట్‌పాల్ స్లూయిస్ కారణంగా ఐదు వేల ఎకరాలలో గడిచిన ఐదేళ్లుగా రైతులు ఒక్క పంట కూడా తీయలేకపోయారు. ఇదే విషయాన్ని కోడూరు మండలం కృష్ణాపురంలో జరిగిన పవన్ కల్యాణ్ పర్యటనలో రైతులు ఆయనకు వివరించే ప్రయత్నం చేయగా, వెంటనే స్పందించిన జిల్లా అధికారులు ఈ సమస్య కారణంగా రైతులు పడుతున్న ఇబ్బందులను పూర్తిస్థాయిలో పవన్‌కు వివరించారు. నాబార్డు సాయంతో అవుట్ ఫాల్ స్లూయిస్‌ల పునర్నిర్మాణానికి చర్యలు తీసుకుంటే బావుటుందని ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, మంత్రి కొల్లు రవీంద్రలు పవన్ కల్యాణ్‌కు వివరించగా, ఈ విషయాన్ని వెంటనే క్యాబినెట్ సమావేశంలో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. తీరగ్రామాల్లో ముంపు సమస్యకు కారణమవుతున్న డ్రెయిన్ల విషయాన్ని, సాగునీటి సమస్యలను అధికారులు పవన్ దృష్టికి తీసుకెళ్లారు.

రెవెన్యూ డివిజన్లు

(5వ పేజీ తరువాయి)

ఇచ్చారు. తాజాగా ఒక రెవెన్యూ డివిజన్ పరిధిలో ఒక నియోజకవర్గం తీసుకురావాలన్న ప్రభుత్వ నిర్ణయం ఈ చిక్కుముడులను పరిష్కరించేలా ఉంది.

గన్నవరం రెవెన్యూ డివిజన్ అవసరం

కృష్ణాజిల్లాలోని గన్నవరం, పెనమలూరును ఎన్టీఆర్ జిల్లా పరిధిలోకి తీసుకురావాలంటే ఉయ్యూరు రెవెన్యూ డివిజన్ కారణంగా రెండు డివిజన్ల సమస్యలు తలెత్తుతాయి. అలాంటప్పుడు ఉయ్యూరు రెవెన్యూ డివిజన్ స్థానంలో గన్నవరాన్ని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయటం వల్ల సమస్యకు చెక్ పెట్టవచ్చు. గన్నవరం నియోజకవర్గంలోని బాపులపాడు, ఉంగుటూరు, గన్నవరం మండలాలు ప్రస్తుతం గుడివాడ రెవెన్యూ డివిజన్‌లోనూ, విజయవాడ రూరల్ (9 గ్రామాలు) విజయవాడ రెవెన్యూ డివిజన్‌లో ఉన్నాయి. గుడివాడ డివిజన్‌లోని మండలాలు, ఉయ్యూరు డివిజన్ పరిధిలోని పెనమలూరు మండలాలను గన్నవరం రెవెన్యూ డివిజన్ పరిధిలోకి తీసుకురావచ్చు. దీంతో పూర్తిస్థాయిలో గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాలు ఎన్టీఆర్ జిల్లాలోకి చేర్చవచ్చు.

ఎందుకంటే..

గన్నవరాన్ని రెవెన్యూ డివిజన్‌గా ఎందుకు చేయాలంటే.. ఇది రెండు నియోజకవర్గాలకు కేంద్రస్థానం. విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం ఇక్కడే ఉంది. ఆర్‌డీవో ఇక్కడే ఉండటం వల్ల ప్రొటోకాల్ డ్యూటీలు నిర్వహించటం తేలిక. ఉయ్యూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో పామర్రు నియోజకవర్గంలోని తోట్లవల్లూరు, పమిడిముక్కల, పామర్రు, మొవ్వ మండలాలు ఉన్నాయి. ఒక్క పెదపారుపూడి మండలం మాత్రమే గుడివాడ రెవెన్యూ డివిజన్‌లో ఉంది. తోట్లవల్లూరు, పెనమలూరు, పామర్రు, మొవ్వ మండలాలను ఉయ్యూరు డివిజన్ నుంచి తొలగించి గుడివాడలో కలపటం ద్వారా పామర్రు నియోజకవర్గం ఎదుర్కొంటున్న రెండు డివిజన్ల సమస్య కూడా పరిష్కారమవుతుంది. అలాగే, గన్నవరం నియోజకవర్గం ఎదుర్కొంటున్న రెండు డివిజన్ల సమస్య కూడా పరిష్కారమవుతుంది.

మైలవరంలోని రెండు డివిజన్ల సమస్య తీరాలంటే..

నియోజకవర్గం ఎదుర్కొంటున్న విజయవాడ, తిరువూరు రెవెన్యూ డివిజన్ల సమస్యను తీరాలంటే మైలవరం రెవెన్యూ డివిజన్‌ను కొత్తగా ఏర్పాటు చేయాలి. తిరువూరు డివిజన్‌ను రద్దుచేసి మైలవరం రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటుచేస్తే విజయవాడ రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఇబ్రహీంపట్నం, జి.కొండూరు, విజయవాడ రూరల్ (5 గ్రామాలు), రెడ్డిగూడెంను మైలవరం రెవెన్యూ డివిజన్ పరిధిలోకి తీసుకురావటంతోపాటు తిరువూరు నియోజకవర్గంలోని ఏ.కొండూరు, గంపలగూడెం, విస్సన్నపేట, తిరువూరును కూడా తీసుకు రావచ్చు. తిరువూరు రెవెన్యూ డివిజన్‌ను రద్దు చేస్తే.. నూజివీడును కృష్ణాజిల్లాలో కలపటం కూడా తేలిక అవుతుంది.

ఐతవరం వద్ద అధికారుల పహారా

నందిగామ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మునేటి వరద క్రమేపీ పెరుగుతుండటంతో అప్రమత్తమైన అధికార యత్రాంగం ఐతవరం వద్ద మోహరించింది. గత ఏడాది వరదల సమయంలో మునేరు ఐతవరం గ్రామం వద్ద రోడ్డుపైకి వచ్చింది. దీంతో జాతీయ రహదారిపై మూడు రోజుల పాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పలు వాహనాలు వరదలో కొట్టుకుపోయాయి. ఈ అనుభవాలు దృష్టిలో పెట్టుకొని అధికారులు అప్రమత్తమయ్యారు. ఏసీపీ తిలక్, సీఐలు వైవీవీఎల్ నాయుడు, చవాన్, ట్రాన్స్‌కో సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. సదరు ప్రదేశంలో ఇప్పటికే వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తున్నది. రోడ్డు క్రింద భాగంలో ఏర్పాటు చేసిన తూముల నిండుగా నీరు ప్రవహిస్తున్నది. ఇంకా ఏమాత్రం వరద పెరిగినా రోడ్డుపైకి నీరు చేరే ప్రమాదం ఉంది. అదే జరిగితే ట్రాఫిక్ నిలిపివేసేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. లైటింగ్ వాహనాలను ఏర్పాటు చేసుకొని ఆ ప్రదేశంలో పహారా కాస్తున్నారు. దీంతో పాటు మధిర రోడ్డులో గల వాగులపై కూడా అధికారులు ఆరా తీస్తున్నారు.

ఐతవరం జాతీయ రహదారికి ఉన్న తూముల వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న అధికారులు, అర్ధరాత్రి విధులు



బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్‌బర్డ్	135, 144, 155
చికెన్ విత్ స్కిన్	260
చికెన్ స్కిన్‌లెస్	270

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 575

ఆర్టీసీ డిపోలోని సమస్యలు పరిష్కరించాలి


నిరసన తెలుపుతున్న ఎన్ఎంయూఏ నాయకులు

గన్నవరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎన్ఎంయూఏ జిల్లా అధ్యక్షుడు బి.నాగిరెడ్డి డిమాండ్ చేశారు. నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్ఎంయూఏ) ఆధ్వర్యంలో ఆర్టీసీ డిపోలో రెడ్ బ్యాడ్జీలు ధరించి గురువారం నిరసన తెలిపారు. నాగిరెడ్డి మాట్లాడుతూ గత తొమ్మిది రోజులుగా డిపో సమస్యలపై నిరసన తెలుపుతున్నా పట్టించుకోవటం లేదన్నారు. ఉద్యోగుల్ని గాలికి వదిలేసి డిపోలో ఇతర అసోసియేషన్ల సహకారంతో ఉద్యోగస్తులను డబల్ డ్యూటీలు చేయాలంటూ అధికారులు వేధిస్తున్నారని తెలిపారు. అక్రమ పనిష్మెంట్‌లను, సస్పెన్షన్‌లను ఆపాలన్నారు. లేడీస్ స్టాఫ్ రూమ్‌లో ఐదు నిమిషాలు కూడా కూర్చోలేని పరిస్థితి ఉందన్నారు. డిపోలో ఉన్న సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. డిపో చైర్మన్ దుర్గారావు, ఈశ్వరరావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎకరాకు రూ. 20వేల పరిహారం ఇవ్వాలి


ఆకునూరులో నేలకొరిగిన అరటితో ట పరిశీలిస్తున్న కౌలురైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు

• ఎం. హరిబాబు

ఉయ్యూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను వల్ల నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 20వేల పరిహారం అందించాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం. హరిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెదఓగిరాల, ఆకునూరు, కాటూరు, కడవకొల్లు, గండిగుంట గ్రామా ల్లో గురువారం కౌలురైతు సంఘం నాయకులతో కలసి పర్యటించి దెబ్బ తిన్న వరి, అరటి పంటలను పరిశీలించారు. నిబంధనలు సడలించి ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. ఈక్రాప్‌తో సంబంధం లేకుండా రైతు లు, కౌలు రైతుల నుంచి ప్రభుత్వం ప్రకటించిన ధరకు ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. కోసూరు శివనాగేంద్రం, అన్నే సుబ్బారావు, రాజేశ్, పలువురు కౌ లు రైతులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల పర్యటన

కూటమి ప్రభుత్వం అప్రమత్తంగా ఉండి జిల్లా యంత్రాంగం సాయంతో తీసుకున్న అత్యవసర చర్యలతో నష్టాన్ని తగ్గించడంలో సఫలమైందని బీజేపీ సీనియర్ నాయకుడు గోపిశెట్టి దుర్గాప్రసాద్ అన్నారు. చినఓగిరాలలో గురువారం పర్యటించి తుఫానుకు నష్టపోయిన వరి, ఇతర పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడి పంటనష్టం వివరాలు తెలుసుకున్నారు. తుఫానుకు వరి, కంద, పసుపు, బొప్పాయి, అరటి పంటలకు తీవ్ర నష్టం కలిగిందన్నారు. నష్టపోయిన రైతులను కూటమి ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందన్నారు. వల్లూరుపల్లి మురళీ కృష్ణ, పాలడుగు సాంబశివరావు, రైతులు పాల్గొన్నారు.


సింగన్నగూడెంలో తడిసి మొలకెత్తిన మినుము పంటను పరిశీలిస్తున్న ఏఓ రంగనాథ్‌బాబు

అట్లూరి నాని పరామర్శ

ఉంగుటూరు : తుఫాను ప్రభావంతో పంట నష్టపోయిన ప్రతిరైతును ప్రభుత్వం ఆదుకుంటుందని, ఎవరూ అధైర్యపడవద్దని టీడీపీ నాయకులు, పొట్టిపాడు పీఏసీఎస్ చైర్మన్ అట్లూరి జోషిమధు(నాని) అన్నారు. తుఫాను ధాటికి గ్రామంలో నేలకొరిగిన వరి పొలాలను గురువారం స్థానిక టీడీపీ నాయకులు, గ్రామసచివాలయ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సూచనల ఎటువంటి ఆస్తి, ప్రాణనష్టం జరుగకుండా ధైర్యం గా ఎదుర్కొన్నామన్నారు. భారీవర్షం, ఈదురుగాలులకు పాలుపోసుకునే దశలో వున్న వరి పడిపోవడంతో రైతులకు నష్టం కలిగిందన్నారు.

జరిగిన పంటనష్టాన్ని అంచనా వేయడంలో వ్యవసాయశాఖాధికారు లు పూర్తిస్థాయిలో పారదర్శకంగా పని చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా పంటనష్టం నివేదికలను సిద్ధంచేయాలన్నారు. స్థానిక టీడీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


మానికొండలో వరిపొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయశాస్త్రవేత్తల బృందం

వ్యవసాయాధికారుల పరిశీలన

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : తుఫాన్ వల్ల పంటనష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, పంట నష్టం అంచనాలను రూపొందించేందుకు కార్యాచరణ చేస్తున్నామని మండల వ్యవసాయశాఖ అధికారి రంగనాథ్‌బాబు తెలిపారు. సింగన్నగూడెం, రంగన్నగూడెం, కానుమోలు, గ్రామాల్లో వరి, మినుము పంటలను గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చేతికి వచ్చిన పంట మొత్తం నష్టపోయామని రైతులు వాపోయారు. మండల వ్యాప్తంగా 16 వేల ఎకరాల్లో సాగు చేసిన వరిలో స్వర్ణరకం 98 శాతం వరకూ నష్టపోయిందని, 1700 ఎకరాలకు పైగా సాగు చేసిన మి నుము, పెసర పంటలు 87శాతం వరకూ పూర్తిగా నష్టపోయినట్లు ప్రాధమిక అంచనాగా వివరించారు. క్షేత్రస్థాయిలో చాలా చోట్ల మినుములో మొక్కలు వచ్చాయని, వరి నీటిలో నానుతోందన్నారు. రైతులు సహకరించి నేలవాలిని వరిపంటపై ఉప్పుద్రావణాన్ని పిచికారి చేయాలని సూచించారు. ఉపసర్పంచ్ బెజవాడ కృష్ణారావు, రైతులు పాల్గొన్నారు.

వ్యవసాయ శాస్త్రవేతల సూచనలు

ఉంగుటూరు : మొంథా తుఫాను ధాటికి వరిపంటకు జరిగే నష్ట తీవ్రతను తగ్గించుకోవడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం రైతులకు సూచించింది. గురువారం ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం(ఆంగ్రూ-గుంటూరు) డీన్ జి.రామచంద్రరావు నేతృత్వంలోని శాస్త్రవేత్తల బృందం, వ్యవసాయశాఖ అధికారులతో కలిసి మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించింది. మానికొండ, తరిగొప్పలలో నేలకొరిగిన వరి పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, చేపట్టాల్సిన చర్యలపై రైతులకు పలు సూచనలు చేసింది. డీన్ రామచంద్రరావు మాట్లాడుతూ ప్రస్తుతం సార్వా వరి చిరుపొట్ట, పాలుపోసుకునే దశలో వుందని, తుఫాను దెబ్బకు చాప లా పడటంతో తాలుగింజలు ఏర్పడి, ధాన్యం రంగు మారే అవకాశముందన్నారు. మానిపండు(మాగుడు)తెగులు కూడా వ్యాప్తిచెందవచ్చునని, నివారణకు ఎకరాకు 200మి.లీ. ప్రోపికోనాజోల్ మందును పిచికారీ చేయాలని సూచించారు. ముందుగా రైతులు తమ పొలం నుంచి వర్షపు నీటిని బయటకు పంపి, పడిపోయిన వరిని పైకిలేపి కట్టాలన్నారు. మండల వ్యవసాయాధికారి గద్దె రమేష్ మాట్లాడుతూ మండలంలోని 27గ్రామాల్లో సుమారు 2223హెక్టార్లలో వరి నేలకొరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేసినట్లు తెలిపారు.మండల వ్యవసాయాధికారి గద్దె రమేష్, ఏఈవో బి.దుర్గానాగేశ్వరరావు, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి, మానికొండ పీఏసీఎస్ చైర్‌పర్సన్ ఆరికట్ల రవికుమార్, ఉయ్యూరు చెరువు పరిశోధనా సంస్థ శాస్త్రవేత్త యు.విజయభాస్కర్‌రెడ్డి, ఘంటసాల కృషివిజ్ఞానకేంద్రం శాస్త్రవేత్తలు జె.పద్మావతి, బి.నవీన్, వీఏఏలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.


చిన ఓగిరాలలో నేలవాలిన వరి పొలం పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు


పొట్టిపాడులో నేలకొరిగిన వరిపైరును పరిశీలిస్తున్న అట్లూరి నాని


రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

సొంత ఖర్చుతో రోడ్డుకు మరమ్మతులు

పెనమలూరు, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): తన సొంత ఖర్చుతో రోడ్డుకు మరమ్మతులు చేయించి ప్రజలకు ఇబ్బందిని తొలిగించి ఆదర్శప్రాయంగా నిలిచారు ఎమ్మెల్యే బోడె ప్రసాద్. తుపాను ప్రభావంతో గోసాల, వణుకూరు, మద్దూరు రోడ్డు దెబ్బతిని ప్రజలు కనీసం ఇంటినుంచి బయటికి రావాలన్నా ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకొన్న ఎమ్మెల్యే మూడు ఎక్స్‌కవేటర్‌లతో స్వయంగా అప్పటికప్పుడు రోడ్డుకు మరమ్మతులు చేయించి ప్రజల ఇబ్బందులను తొలిగించారు. ఆయన వెంట టీడీపీ కూటమి నేతలు ఉన్నారు.


విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎంఈఓ రాంబాలసింగ్

సంవిధాన్ దివస్ వ్యాస రచన పోటీలు

హనుమాన్‌జంక్షన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ దినోత్సవాన్ని (సంవిధాన్ దివస్) పురస్కరించుకొని బాపులపాడు జడ్పీ హైస్కూల్‌లో మండల స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వ్యాస రచన, క్విజ్ వక్తృత్వ పోటీలు నిర్వహించారు. వ్యాస రచనలో ప్రథమ స్థానం కానుమోలు జడ్పీ హైస్కూల్ విద్యార్థిని ఎం.దుర్గకీర్తన, వక్తృత్వంలో వేలేరు హైస్కూల్ విద్యార్థిని ఆశ్రిత, క్విజ్‌లో ఆరుగొలను జడ్పీ హైస్కూల్ విద్యార్థిని ఆదిత్యవర్మ విజేతలుగా నిలిచారు. నియోజకవర్గం స్థాయిలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని బాపులపాడు హైస్కూల్ హెచ్ఎం శ్రీనివాసరావు తెలిపారు. విజేతలను ఎంఈవోలు రాంబాలసింగ్, కె.విజయ్ అభినందించారు.


నవదిన ప్రార్థనల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న రెవరెండ్ ఫాదర్ కిషోర్

క్రీస్తు మార్గం అనుసరణీయం

గన్నవరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): క్రీస్తు మార్గం అనుసరణీయమని రెవరెండ్ ఫాదర్ కిషోర్ అన్నారు. కేసరపల్లి ఆర్‌సీఎం చర్చిలో క్రీస్తు జయంతి సందర్భంగా డిసెంబరు 23 వరకూ పునీత ఆంథోని పేరిట తొమ్మిది మంగళవారాలు నవదిన ప్రార్థనలను, దివ్యబలి పూజలు జరిపేందుకు గురువారం కరపత్రాలను విజయవాడ మేత్రాసన గురువులు రెవరెండ్ ఫాదర్ పీకే జోసఫ్ ఆవిష్కరించారు. నవదిన ప్రార్థనలు భక్తి శ్రద్ధలతో జరపాలని సూచించారు. నవంబరు 4న విజయవాడ బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావుచే పునీత ఆంథోని స్వరూపం ప్రతిష్ఠాపన జరుగుతుందన్నారు. సంఘ పెద్దలు, మరియదళం సభ్యులు పాల్గొన్నారు.


గండిగుంటలో హైవే, సర్వీస్ రోడ్ల పక్క చెత్త కుప్పలు తొలగిస్తున్న పంచాయతీ శానిటరీ సిబ్బంది

హైవే, సర్వీస్ రోడ్ల పక్క చెత్తకుప్పల తొలగింపు

ఉయ్యూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): గండిగుంట గ్రామపంచాయతీ పరిధిలో జాతీయ రహదారి, సర్వీస్ రోడ్ల పక్కన పేరుకుపోయిన చెత్త కుప్పలను పంచాయతీ శానిటరీ సిబ్బంది తొలగిస్తున్నారు. పంచాయతీ పరిధిలో ఉన్న హైవే, సర్వీస్ రోడ్ల పక్కన రోజుల తరబడి చెత్తకుప్పలు, వ్యర్థాలు పేరుకుపోగా హైవే అధికారులు పట్టించుకోని నేపథ్యంలోఓ జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేర సిబ్బంది చేత చెత్తకుప్పలు తొలగించి శుభ్రపర చి, బ్లీచింగ్, సున్నం చల్లించి అపరిశుభ్రత లేకుండా చర్యలు చేపట్టినట్టు పంచాయతీ కార్యదర్శి కుమార్ తెలిపారు.

గన్నవరం మార్కెట్ యార్డ్ చైర్మన్ విస్తృత పర్యటన

విజయవాడ రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాను కారణంగా దెబ్బతిన్న గ్రామాల్లో గన్నవరం మార్కెట్ యార్డ్ చైర్మన్ గూడవల్లి నరసింహారావు(నర్సయ్య) గురువారం విస్తృతంగా పర్యటించారు. నున్న ఎన్టీపీసీ, మ్యాంగో మార్కెట్ మధ్య రహదారి జలమయమై వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న ప్రాంతాన్ని పరిశీలించారు. నీటి మళ్లింపునకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. పి. నైనవరంలోని కుక్కలవాని కుంట చెరువు గండి పూడికతీత పనులను పరిశీలించారు. గ్రామంలో దెబ్బతిన్న పంటలను ఆయన పరిశీలించారు. అంబాపురం పాముల కాలువ గుర్రపుడెక్క తూటికాడతో నిండి తూములు పూడుకుపోవడాన్ని పరిశీలించిన ఆయన కాలువ ప్రవాహాన్ని పునరుద్ధరించాలని అధికారులను కోరారు. అంబాపురం, పి. నైనవరం గ్రామాల మధ్య జన్మభూమి రోడ్డు పూర్తిగా ధ్వంసమై రాకపోకలకు ఇబ్బందిగా మారడాన్ని పరిశీలించి నిర్మాణానికి కృషి చేస్తానని రైతులకు హామి ఇచ్చారు. టీడీపీ నేతలు గుజ్జర్లపూడి బాబురావు, రైతు నాయకులు గుంటక సుబ్బారెడ్డి, సర్పంచ్ గండికోట సీతయ్య, టీడీపీ రూరల్ మండలం అధ్యక్షుడు గొడ్డళ్ల చిన్నరామారావు, గంపా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


వర్షాలకు ధ్వంసమైన జన్మభూమి రోడ్డును పరిశీలిస్తున్న మార్కెట్ యార్డ్ చైర్మన్ గూడవల్లి నరసింహారావు

విద్యార్థులలో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీయాలి


పోటీలను పరిశీలిస్తున్న ఎంపీడీవో స్వర్ణలత, డీవైఈవో రవికుమార్

• ఎంపీడీవో టి.స్వర్ణలత

గన్నవరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులలో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీయాలని ఎంపీడీవో టి.స్వర్ణలత అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం మండల స్థాయి పోటీలు నిర్వహించారు. ఎంపీడీవో స్వర్ణలత మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. పోటీల్లో పాల్గొన్నప్పుడే ప్రతిభ బయటకు వస్తుందన్నారు. గుడివాడ డీవైఈవో కొండా రవి కుమార్ మాట్లాడుతూ వ్యాస రచన, వక్తృత్వం, క్విజ్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. తొమ్మిది ఉన్నత పాఠశాలల నుంచి 27 మంది విద్యార్థులు పోటీలకు రాగా ముగ్గురు నియోజకవర్గ స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు తెలిపారు. ఎంఈవో కమల, పాఠశాల హెచ్ ఎం పార్వతి, రిటైర్డ్ హెచ్ఎం ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

వలస కార్మికులకు ప్రత్యేక ఆధార్ శిబిరం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి) : ప్రత్యేక గుర్తింపు సంఖ్య కలిగిన ఆధార్‌తోనే ప్రభుత్వ సంక్షేమపథకాలు అందుతాయని, అధార్ తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని వలస కార్మికులకు తహసీల్దార్ మురళీకృష్ణ సూచించారు. వీరవల్లిలో పునరావాస కేంద్రంలోని వలసకార్మికులకు ఆధార్ లేకపోవడాన్ని గమనించి ఆర్డీవో సుబ్రహ్మణ్యంతో సంప్రదించి అప్పటిప్పుడే ఆధార్ శిబిరం ఏర్పాటు చేశారు. డేరాలు వేసుకుని నివశించే నాలుగు కుటుంబాలకు చెందిన 14 మందికి ఆధార్ నమోదు పత్రాలను అందజేశారు. పీహెచ్‌సీ డాక్టర్ కిరణ్మయి, వీఆర్ఓ సునీల్‌కుమార్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


ప్రత్యేక ఆధార్‌క్యాంపును పరిశీలిస్తున్న తహసీల్దార్ మురళీకృష్ణ


బాధిత కుటుంబాలకు బియ్యం, నిత్యావసరాలు అందిస్తున్న వీఆర్వో సునీల్‌కుమార్

నిత్యావసరాల పంపిణీ

హనుమాన్‌జంక్షన్‌రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి) : వీరవల్లిలో తుఫాన్ బాధితులకు అండగా నిలబడి వీఆర్వో సునీల్‌కుమార్ ఔదార్యాన్ని చాటారు. వీరవల్లి చెరువుగట్టుపై నివాసముంటున్న కుటుంబాలకు సునీల్‌కుమార్ తన స్వొంత ఖర్చులతో బియ్యం బస్తా, నిత్యావసరాలను గురువారం అందజేశారు. తుఫాన్ బాధిత కుటుంబాలు తిరిగి వెళ్లే సమయంలో వారికి పసిబిడ్డలు ఉండటంతో తన వంతు సహకారంగా నిత్యావసరాలను అందించారు.

రైతులూ.. ఆందోళన వద్దు

- పెనమలూరు, పామర్రు నియోజకవర్గాల్లో వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు పర్యటన
- స్థానిక ఎమ్మెల్యేలు బోడె ప్రసాద్, వర్ల కుమార్ రాజాతో కలిసి పంట నష్టం పరిశీలన

పెనమలూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను ప్రభావంతో పంట నష్టపోయిన రాష్ట్రంలోని ప్రతి రైతునూ రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటుందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారు. గురువారం ఆయన స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అభ్యర్థన మేరకు వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులతో కలిసి తాడిగడపలో తుపానుకు నేలకొరిగిన కంద, అరటి, పసుపు పంటలను పరిశీలించారు. భారీగా పంట నష్టపోయిన రైతు రాజబాబును పరామర్శించి పంట నష్టం వివరాలను అడిగి తెలుసుకొని మీడియాతో మాట్లాడారు. ప్రకృతి వైపరీత్యాలను అడ్డుకోలేమని, నష్టశాతాన్ని నివారించుకోగలిగామన్నారు. ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందన్నారు. క్షేత్రస్థాయిలో పంట నష్ట అంచనాలు తయారు చేసి కేంద్ర ప్రభుత్వానికి నివేదిస్తామని ఇరు ప్రభుత్వాలు రైతులకు ఆర్థిక సాయం అందిస్తాయన్నారు. 25న తుపాను ప్రకటన వెలువడినప్పటి నుంచి రైతుల పంటల నష్ట నివారణకు, ప్రాణనష్ట




తాడిగడపలో అరటి, కంద పంటలను ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌తో కలిసి, వెంట్రప్రగడలో వరిపైరును ఎమ్మెల్యే కుమార్‌రాజాతో కలిసి పరిశీలిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

నివారణకు అత్యంత ప్రాముఖ్యత ఇచ్చామన్నారు. బుధవారం ఏరియల్ సర్వే చేసిన సీఎం చంద్రబాబు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేసి వాస్తవ గణాంకాలను ఇవ్వాలని అధికారులను ఆదేశించారని, త్వరలో పంటనష్ట పరిహారాన్ని రైతులకు అందిస్తామన్నారు. తుపాన్ ప్రభావం తీవ్రంగా ఉందనే హెచ్చరికలతో సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అప్రమత్తమై అధికార వ్యవస్థ మొత్తాన్ని రంగంలోకి దించి ప్రాణ నష్టం లేకుండా నివారించగలిగారన్నారు. మిర్చి క్వింటాల్ ధర రూ.14వేలకు పైగా ఉంటే ఇది కూడా తెలుసుకోలేని జగన్ ఇంట్లో కూర్చొని రూ.11,500 అని మాట్లాడడం హాస్యాస్పదమన్నారు. మామిడి రైతును ఆదుకునేందుకు రూ.300 కోట్లను అందించామని, 10వేల మిలియన్ల కిలోల పొగాకులను ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ఆదుకున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వమన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీని రూ.17వేల నుంచి రూ.25వేలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదన్నారు. పంట నష్టపోయిన రైతులున్న పంటను ఎలా రక్షించుకోవాలో సలహాలిచ్చేదుకు వ్యవసాయ, ఉద్యాన శాఖ శాస్త్రవేత్తలను రంగంలోకి దించుతున్నామన్నారు. టీడీపీ కూటమి నేతలు అనుమోలు ప్రభాకరరావు, కోయ ఆనంద్ ప్రసాద్, వెలగపూడి శంకరబాబు, యార్లగడ్డ సుచిత్ర, సంగెపు రంగారావు, పీతా గోపీచంద్, తుమ్మల రాంకుమార్, తాతపూడి గణేష్, యేకుల విజయేంద్ర, నర్రా చంటి, మేడసాని రత్నకుమారి, కొండా ప్రవీణ్, ఏడీ సునీల్, తహసీల్దారు గోపాలకృష్ణ, ఏవో శైలజ పాల్గొన్నారు.

వెంట్రప్రగడలో ఎమ్మెల్యే వర్లతో కలిసి..

పెదపారుపూడి: ప్రభుత్వం చేయాల్సిందంతా చేస్తుందని, వ్యవసాయ శాఖ సూచలను రైతులు పాటించాలని మంత్రి అచ్చెనాయుడు అన్నారు. గురువారం సాయంత్రం పెదపారుపూడి మండల పరిధిలోని వెంట్రప్రగడ గ్రామంలో నేలకొరిగిన వరిపైరును ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజాతో కలిసి మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల కష్టాలను దృష్టిలో ఉంచుకొని నష్టం అంచనాలు రూపొందించాలని, వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు చేతికొచ్చిన వేళ తుపాను రావటం బాధాకరమన్నారు. ప్రకృతి వైపరీత్య సమయంలో వ్యవస్థలన్నీ సమర్థవంతంగా పని చేశాయన్నారు. ప్రాణనష్టం లేకుండా చేశామని, ప్రాథమిక అంచనాలకు ప్రాధాన్యత ఇవ్వకుండా క్షేత్రస్థాయిలో వాస్తవాలు తెలుసుకునేలా 4 రోజుల్లోపు పూర్తి నివేదికలు సిద్ధం చేయాలని, గ్రామాలవారీగా బృందాలను ఏర్పాటు చేశామన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందిస్తామన్నారు. హెక్టార్‌కు 25వేల నష్టపరిహారం అందించిన చరిత్ర సీఎం చంద్రబాబుదే అన్నారు. జగన్ అబద్దాలు మానుకుంటే మంచిదని హితవు పలికారు. వీరంకి గురుమూర్తి, టీడీపీ మండల అధ్యక్షులు చలసాని రమేష్ చౌదరి, మండల ప్రధాన కార్యదర్శి మనిముక్కు రాంబాబు, పీఏసీఎస్ అధ్యక్షులు కూచిపూడి సుబ్బయ్య, సూరపనేని వెంకట సత్యనారాయణ, బుడ్డాలు, కాటమరాజు, ఏవో ఆంజనేయులు, అధికారులు, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోండి.. మంత్రిని కోరిన మాజీ ఎంపీపీ దేవినేని

కంకిపాడు: మొంథా తుపాను కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎంపీపీ దేవినేని రాజా వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడును కోరారు. పాక్షికంగా పడిపోయిన పంటకు రూ.6800 రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం ప్రకటించిందన్నారు. అయితే 45 నుంచి 50 బస్తాలు దిగుబడి కావాల్సిన పంట తుపాను కారణంగా 15 నుంచి 20 బస్తాల మధ్య దిగుబడి పడిపోతుందన్నారు. దిగుబడి వచ్చిన 15 నుంచి 20 బస్తాలను కూడా కొనుగోలు చేయకుండా ఆ సర్వే నంబర్‌ను ప్రభుత్వం బ్లాక్ లిస్టులో పెడుతుందన్నారు. ఇలాంటి సమయంలో దిగుబడి వచ్చిన 15 నుంచి 20 బస్తాల పరిస్థితి ఏంటని మంత్రిని ప్రశ్నించారు. మరోపక్క రాష్ట్ర వ్యాప్తంగా కౌలు రైతులు అధిక సంఖ్యలో సాగు చేస్తున్నారన్నారు. ఒక్కో రైతు సుమారు 15 నుంచి 20 ఎకరాలు సాగు చేస్తున్నారని, ప్రభుత్వం ఒక్కో రైతు, కౌలు రైతుకు కేవలం 5 ఎకరాలకు నష్ట పరిహారం చెల్లిస్తే మిగిలిన పంట పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. మాజీ ఎంపీపీ దేవినేని రాజా అడిగిన ప్రశ్నలకు ఆయన సానుకూలంగా స్పందించారు. సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.



మంత్రి అచ్చెన్నతో మాట్లాడుతున్న రాజా

నేలకొరిగిన అరటి తోటలు

- లక్షల్లో నష్టపోయామంటున్న రైతులు
- ఆదుకోవాలని వేడుకోలు

మోపిదేవి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): అధిక వర్షాలు, తుఫాను ప్రభావంతో వందల ఎకరాల్లో సాగు చేసిన అరటి తోటలు నేలకొరగటంతో రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. మోపిదేవి మండలంలోని మోపిదేవిలంక, నాగాయితిప్ప గ్రామాల్లో అరటి, కంద, పసుపు వాణిజ్య పంటలు అధికంగా సాగు చేస్తున్నారు. రూ.50వేలతో లీజు తీసుకుని రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టి పంటలను సాగు చేశారు. మరికొద్ది రోజుల్లో చేతికి అందివస్తాయనుకున్న తోటలు విరిగి నేలపాలయ్యాయి. నేలకు ఒరిగిపడి ఉన్న అరటి తోటలను చూస్తున్నా రైతులు మా వెన్ను విరిగిపోయిందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరుస ఉపద్రవాలతో రైతులు ఆర్థికంగా కోలుకోలేని నష్టాలు చవి చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందంటూ మోపిదేవి లంక, నాగాయితిప్ప గ్రామాల రైతులు ఆవేదన చెందుతున్నారు. ఆయా గ్రామాల పరిధిలో 350 ఎకరాలకు పైగా అరటి, కంద, పసుపు తోటలు సాగు చేస్తుండగా, పూర్తిగా నేలపాలయ్యాయని చెబుతున్నారు. ప్రభుత్వం పంటల బీమా పథకాన్ని అమలు చేసి నష్టపోయిన వాణిజ్య పంటల రైతులను ఆదుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నాలుగెకరాల అరటి.. పది లక్షలు నష్టం.. రాజులపాటి నరసారావు, కౌలు రైతు

నాగాయితిప్పలో 4 ఎకరాలు కౌలుకు తీసుకొని అరటి పంట సాగు చేశాను. కొద్దిరోజుల్లో పంట చేతికి వస్తుందనగా అధిక వర్షాలు, తుఫాను రూపంలో మొత్తం నేలమట్టం అయింది. రూ.10 లక్షలకుపైగా నష్టం వాటిల్లింది. వరుస ఉపద్రవాలతో ఆర్థికంగా కోలుకోలేని నష్టాలు చవిచూడాల్సి వచ్చింది. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలి.



పూర్తిగా విరిగి పడిపోయిన అరటి పంటను చూపిస్తున్న రైతు రాజులపాటి నరసారావు



విజయవాడలోని విద్యాధరపురం బస్ డిపోలో నీట మునిగిన బస్సులు

పునరావాస కేంద్రాల్లో వైద్యసదుపాయాలు: డీఎంహెచ్‌వో

విజయవాడ: ఎగువన కురిసిన వర్షాలతో మున్నేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో చిట్యాల వంతెన వద్ద రాకపోకలకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉంది. ఈ క్రమంలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాలను, వైద్య శిబిరాలను కలెక్టర్ లక్ష్మీశ, సీపీ ఎస్వీ రాజశేఖరబాబు పరశీలించారు. చిట్యాలతో పాటు లింగాల ఉన్నత పాఠశాల పునరావాస కేంద్రాల్లో అత్యవసర మందులతో సహా అన్ని వైద్య సదుపాయాలు ఏర్పాటు చేసినట్టు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం సుహాసిని తెలిపారు.



పదవీ విరమణ పొందిన సమాచార శాఖ ఉద్యోగులు జాస్తి వెంకటలక్ష్మి, రూపవాణి దంపతులను సత్కరిస్తున్న అదనపు డైరక్టర్ స్వర్ణలత

విధి నిర్వహణలో మహిళా ఉద్యోగుల పాత్ర కీలకం

- సమాచార శాఖ అదనపు డైరెక్టర్ స్వర్ణలత

కలెక్టరేట్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేసే మహిళా ఉద్యోగులు, అధికారులు విధి నిర్వహణలో అందించే సేవలు ఎంతో కీలకమని ప్రజలకు ప్రభుత్వానికి వారధి అయిన సమాచార పౌర సంబంధాల శాఖలో అత్యంత సమర్థవంతంగా సేవలందించిన సూపరింటెండెంట్ ఎం రూపవాణి, విజయవాడ రాష్ట్ర సమాచార కేంద్రం లైబ్రేరియన్‌గా పనిచేస్తున్న జాస్తి వెంకటలక్ష్మి పనితీరు అభినందనీయమని సమాచార శాఖ అదనపు సంచాలకులు ఎల్‌స్వర్ణలత అన్నారు. ఈనెల 31న పదవీ విరమణ చేయనున్న రూపవాణి, వెంకటలక్ష్మికి రాష్ట్ర సమాచార పౌర సంబంధాల కమిషనర్ కార్యాలయంలో గురువారం సన్మానం చేశారు. ఈ సందర్భంగా స్వర్ణలత మాట్లాడుతూ ఒకవైపు గృహిణిగా మరోవైపు ఉద్యోగిగా బాధ్యతలను అలుపెరగక నిర్వహిస్తారన్నారు. దాదాపు 40 ళ్లుగా వెంకటలక్ష్మి, 33 ఏళ్లుగా రూపవాణి తమ బాధ్యతలను నిర్వర్తిస్తూ తమదైన శైలిలో సేవలందించిన మహిళా సిబ్బందికి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని తెలిపారు. వారి సేవలు నేటితరం వారికి స్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు వారధిలా నిలిచే సమాచార శాఖలో పనిచేసే అవకాశం రావడం అదృష్టంగా భావించి ఉద్యోగులంతా సమర్థవంతంగా పనిచేసి మంచి పేరు సంపాదించాలని కోరారు. అనంతరం వెంకట లక్ష్మీప్రసాద్ దంపతులను రూపవాణిని సన్మానించారు. రాష్ట్ర సమాచార శాఖ జాయింట్ డైరెక్టర్ ఐ సూర్యచంద్రరావు, డిప్యూటీ డైరెక్టర్లు బీ పూర్ణచంద్రరావు, వెంకట్రాజు గౌడ్, డీ రమేష్ భాస్కరనారాయణ, ఏడీలు ఎస్‌వీ మోహన్‌రావు, పీ రాజశేఖర్, ఏఎస్ వీరభద్రరావు, ఏ నారాయణరెడ్డి, డీఐపీఆర్‌వో కేవీ రమణరావు, డీఎల్ పీఆర్‌వో కే రవి, విశ్రాంత అధికారి ఎస్ శ్రీనివాస్ జీవన్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

నిరంతరం అప్రమత్తం

మునేరు, కృష్ణానదికి పోటెత్తుతున్న వరద

- ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు
- నష్టపోయిన ప్రతి రైతుకూ పరిహారం
- రైతుల క్షేమం, సంక్షేమం ధ్యేయంగా ప్రభుత్వం చొరవ: కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రాంతంలో కురిసిన వర్షాలతో మునేరుకు వరద పోటెత్తుతోందని, ఈ నేపథ్యంలో మునేరుతో పాటు కృష్ణానదిలోని వరద ప్రవాహాలను నిరంతరం పర్యవేక్షిస్తూ అప్రమత్తంగా ఉన్నట్టు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. గురువారం కలెక్టర్ లక్ష్మీశ, పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు, నందిగామ శాసనసభ్యులు తంగిరాల సౌమ్యతో కలిసి కీసర వంతెన వద్ద మునేరు వరద ఉధృతిని పరిశీలించారు. అనంతరం కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు వివిధ ప్రాంతాల్లో వరద పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ కృష్ణా, మునేరు, కట్టలేరు, వైరా, పాలేరులోని ప్రవాహాలపై ప్రత్యేకంగా దృష్టిపెట్టామని, మునేరుకు అటూ ఇటూ ఉన్న 40 గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశామన్నారు. ఎవరికీ ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకొన్నామని, గ్రామ సచివాలయాలు, పాఠశాలలను సిద్ధంగా ఉంచామని, ఏ ఇబ్బంది తలెత్తినా వెంటనే ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించే ప్రణాళికలతో ముందుకెళ్తున్నామన్నారు. జాతీయ రహదారులు (ఎన్‌హెచ్), ఆర్అండ్‌బీ, ఇరిగేషన్, రెవెన్యూ, పోలీసు ఇలా వివిధ శాఖల అధికారుల బృందాలు సమన్వయంతో పనిచేస్తున్నట్టు తెలిపారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందులుంటే ప్రత్యామ్నాయ రహదారులకు కూడా ప్రణాళికలన్నట్టు వివరించారు.



మునేరు వరద పరిస్థితిని పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు

రైతులకు ప్రభుత్వం పూర్తి భరోసా

రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, నష్టాల తుది అంచనాల నివేదికలకు అనుగుణంగా నష్టపోయిన ప్రతిరైతుకూ పరిహారం అందించి ప్రభుత్వం అండగా నిలుస్తుందని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. అన్నదాతల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకొంటున్నారని, సూచనలిస్తున్నారన్నారు. ప్రకాశం బ్యారేజీకి వరద నీరు పోటెత్తుతోందని, ఈ నేపథ్యంలో బ్యారేజీకి ఎగువన, దిగువన ప్రాంతాల ప్రజలకు ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశామన్నారు.



ఎన్టీఆర్ జిల్లా చందాపురంలో పాడైన పత్తి పంటను చూపిస్తున్న రైతు



ఏటిమొగ పంచాయతీలో విద్యుత్ పునరుద్ధరణ పనులు చేస్తున్న కార్మికులు

అంధకారంలోనే గ్రామాలు

నాగాయలంక, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను తీరం దాటి రెండు రోజులు దాటినా మండలంలోని పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా లేక అంధకారంలోనే మగ్గుతున్నాయి. 28న మధ్యాహ్నం నుంచే మండలంలోని 22 పంచాయతీల గ్రామాల్లో అధికారులు విద్యుత్ సరఫరా నిలుపుదల చేశారు. 29న సాయంత్రానికి నాగాయలంక, భావదేవరపల్లి, కమ్మనమోలు, నాలి, మర్రిపాలెం, వక్కపట్లవారిపాలెం పంచాయతీల్లో మాత్రమే విద్యుత్ సరఫరా, విరిగిన చెట్లను తొలగించి ఇచ్చారు. మిగిలిన 16 పంచాయతీల్లో విద్యుత్ సరఫరా లేక గ్రామస్థులు చీకట్లలోనే మగ్గుతున్నారు. రెండు రోజులుగా విద్యుత్ లేకపోవటంతో వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజులు బిల్లు కట్టకపోతే వెంటనే ఫీజులు తీసిన వారు ఇప్పుడు విద్యుత్ సరఫరా తక్షణం ఎందుకు ఇవ్వరని ప్రశ్నిస్తున్నారు.

మండలంలో విరిగిన 200 విద్యుత్ స్తంభాలు


మొంథా తుఫాను వల్ల సంభవించిన పెనుగాలులకు 200 విద్యుత్ స్తంభాలు విరిగినట్టు గుర్తించామని ఏఈ జీ వెంకటరాజు తెలిపారు. 16 ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోగా, వాటిలో 6 పునరుద్ధరించామన్నారు. మండలంలోని 22 పంచాయతీల గ్రామాల్లో 6 పంచాయతీల గ్రామాలకు మాత్రమే విద్యుత్ సరఫరాను అందించామన్నారు. గురువారం మరో 4 పంచాయతీలకు అందిస్తున్నామన్నారు. మిగిలిన పంచాయతీల్లో విద్యుత్ లైన్లను పునరుద్దరణ చేసి త్వరగా ఇచ్చేందుకు కృషి చేస్తున్నట్టు ఏఈ తెలిపారు.

మళ్లీ కృష్ణానదికి వరద

ప్రకాశం బ్యారేజీ నుంచి కృష్ణానది దిగువకు 3 లక్షల క్యూసెక్కుల వరద నీటిని విడుదల చేశారని మండల తహసీల్దార్ వీరాంజనేయ ప్రసాద్ తెలిపారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు వరద స్థాయి ఇంకా పెరుగుతుందన్నారు. మండలంలోని నదీ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఒక పక్క మొంథా తుపానుతో తేరుకుంటున్న ప్రజలకు మళ్లీ వరద కృష్ణానదికి రానుండటంతో అప్రమత్తం అవుతున్నారు.


బార్ కౌన్సిల్ బరిలోకి.. పదిమందికి పైనే!

- సీవోపీ అయిన వారికే ఓటు హక్కు
- బెజవాడ బార్ నుంచి సిట్టింగ్ సభ్యులైన సుంకర, చలసాని తిరిగి పోటీ



విజయవాడ లీగల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): బార్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఎన్నికల బరిలోకి ఈసారి బెజవాడ బార్ నుంచి 10 మంది న్యాయవాదులకు పైగా పోటీ పడుతున్నారు. వీరిలో సిట్టింగ్ సభ్యులైన సుంకర రాజేంద్రప్రసాద్ (4వ సారి), చలసాని అజయ్‌కుమార్ (2వ సారి)తో పాటు మరో పది మంది ఉన్నారు. సుంకర రాజేంద్రప్రసాద్‌కు ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఏఐఎల్‌యూ) న్యాయవాదుల సపోర్టు, చలసాని అజయ్‌కుమార్‌కు ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్)కు చెందిన న్యాయవాదుల సపోర్టు ఉంటుంది. రాష్ట్రంలోని గుర్తింపు పొందిన 152 బార్ అసోసియేషన్ల నుంచి సుమారుగా 150 నుంచి 200 మంది వరకు బార్ కౌన్సిల్ సభ్యులుగా పోటీలో ఉండే అవకాశం ఉంది. వీరికి రాష్ట్రంలోని అన్ని బార్ అసోసియేషన్ల చెందిన దాదాపు 33,991 మంది న్యాయవాదులు ఓటు వేసి 25 మంది సభ్యులను ఎన్నుకోవాలి. సీవోపీ డిక్లరేషన్ చేయాల్సిన వారు దాదాపు 8వేల మంది ఉన్నారు. దాదాపు 42వేల మంది న్యాయవాదులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. పోటీ చేసే న్యాయవాదులు నామినేషన్ ఫీజు కింద రూ.1.25 లక్షలు చెల్లించాలి. ఒక్కో న్యాయవాది 25 మంది న్యాయవాదులకు ఓటు వేయాలి. మొదటి ప్రిఫరెన్సియల్ ఓటు ఎవరికి ఎక్కువ పడితే వారు విజేత. సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీసింగ్ (సీవోపీ) చేసిన వారికే ఓటు హక్కు. జనవరి 31లోగా దేశంలోని అన్ని బార్ కౌన్సిళ్లకు ఎన్నికలు నిర్వహించాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. బెజవాడ 'బార్' నుంచి సుంకర, చలసానితోపాటు పీడీఎస్ నారాయణ, అరిగెల రాజా, సీహెచ్ మన్మథరావు, చావలి అబ్రహంలింకన్, మట్టా జయకర్, చంద్రగిరి విష్ణువర్ధన్, గంగిశెట్టి ఉమాశంకర్ (అయ్యప్ప), ఇస్మాయిల్ షేక్, బర్రె శ్రీనివాసరావు, అల్లాడ రామకృష్ణ, శ్రవణం అచ్యుతరామయ్య బెజవాడ బార్ నుంచి పోటీ పడుతున్నారు.

ఇంద్ర బస్సుకు తప్పిన ప్రమాదం



హనుమాన్‌జంక్షన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఇంద్ర ఏసీ బస్సుకు గురువారం హనుమాన్‌జంక్షన్‌లో తృటిలో ప్రమాదం తప్పింది. ఏలూరు డిపోకు చెందిన ఇంద్ర సర్వీస్ హైదరాబాద్ నుంచి ఏలూరు వెళుతూ మార్గమధ్యంలో హనుమాన్ జంక్షన్ బస్టాండ్ లోపలికి వస్తున్న సందర్భంలో బస్సు పైభాగానికి ప్రవేశ మార్గంలో ఉన్న పాత బస్టాండ్ షెడ్ పైకప్పుకున్న ఇనుప రాడ్లను ఢీకొంది. దీంతో బస్సు పై భాగంలో నిప్పు రవ్వలు రేగడంతో బస్టాండ్‌లో ప్రయాణికులు కేకలు వేశారు. డ్రైవర్ అప్రమత్తమై బస్సును నిలిపివేసి ప్రయాణికులను దింపేశారు. ఏలూరులో దిగాల్సిన 15 మంది ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదం లేకపోవడంతో అదేబస్సులో ప్రయాణికులను ఏలూరు తరలించారు. బాడీ ఎత్తుగా ఉన్న బస్సులు పాత బస్టాండ్ షెడ్ రేకులకు అమర్చిన ఇనుపరాడ్లు ప్రమాదకరంగా మారుతున్నాయి. డ్రైవర్లు అప్రమత్తంగా ఉండి బస్సులను నడపాల్సి వస్తోంది. అధికారులు స్పందించి షెడ్‌ను తొలగించాలని కోరుతున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	135, 144, 155
చికెన్ విత్ స్కిన్	260
చికెన్ స్కిన్‌లెస్	270

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 575

రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలు

గుడివాడ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి) : స్థానిక ముబారక్ సెంటర్‌లోని షాదీఖానా వద్ద ఎదురుగా రెండు బైక్‌లు ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానిక గుడ్‌మెన్‌పేటకు చెందిన మానేపల్లి నాని, శేషులు తమ ద్విచక్రవాహనంపై బుధవారం రాత్రి 11గంటల సమయంలో ఇంటికి వెళుతుండగా, షాదీఖానా వద్ద ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొట్టడంతో వారిద్దరూ గాయాలపాలయ్యారు. చికిత్స నిమిత్తం స్థానిక ఏరియా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ పి.లోవరాజు తెలిపారు.



ర్యాలీలో పాల్గొన్న డైరెక్టర్ జనరల్ సుభాష్, రమాదేవి

వ్యాయామంతోనే సంపూర్ణ ఆరోగ్యం

గుడివాడ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి) : శారీరక ధృఢత్వంలో వైద్యులు ప్రతి ఒక్కరికీ రోల్ మోడల్‌గా నిలవాలని హోమియోపతి ప్రాంతీయ పరిశోధనా సంస్థ ఇన్‌చార్జ్ కిషన్ బానోతు అన్నారు. గురువారం స్థానిక ఏలూరురోడ్డులోని హోమియోపతి ప్రాంతీయ పరిశోధనా సంస్థ ఆధ్వర్యంలో హోమియోపతి ప్రాంతీయ పరిశోధనా సంస్థ డైరెక్టర్ జనరల్ సుభాష్ కౌశిక్ ఆదేశాల మేరకు ఫిట్ ఇండియా ఫ్రీడం రన్ 2.0 ర్యాలీ నిర్వహించారు. తొలుత ర్యాలీని డాక్టర్ గురురాజు హోమియోపతి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమాదేవి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శరీరానికి వ్యాయామం అవసరమన్నారు. పట్టణ ప్రజలకు అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంతో ర్యాలీని నిర్వహిస్తున్నామన్నారు. పట్టణంలోని ప్రాంతీయ పరిశోధనా సంస్థ నుంచి పట్టణంలోని ప్రధాన రహదారుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో డాక్టర్లు, జూనియర్ డాక్టర్లు, వైద్యకళాశాల విద్యార్థులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



పెనుముత్సలో సమస్యలు తెలుసుకుంటున్న రాము

తుఫాను ప్రభావితులకు సాయం

పమిడిముక్కల: పెనుముత్స గ్రామంలో మొంథా తుఫాను ప్రభావిత బాధితులకు గ్రామానికి చెందిన మొవ్వ రాము ఆహార పదార్థాలు, ఆర్థిక సాయం అందజేశారు. తుఫానుప్రభావంతో ఇబ్బంది పడుతున్న వృద్ధులు, పేదలకు గడిచిన మూడు రోజులుగా ఆహార పదార్థాలు, అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్న వారిని పరామర్శించి ఆర్థిక సాయం చేశారు. వినాయకస్వామి, మాధవ, నాగార్జున బాధితులను పరామర్శించిన వారిలో ఉన్నారు.

పంట నష్టాన్ని ఆర్ఎస్‌కేలో నమోదు చేసుకోవాలి

● వ్యవసాయ అధికారి గణేశ్ రెడ్డి



బొమ్ములూరులో పొలాలను పరిశీలిస్తున్న ఏడీఏ ఎస్.కవిత, తదితరులు

పమిడిముక్కల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతులు రైతుసేవా కేంద్రాల్లో తగిన పత్రాలతో పేర్లు, ఇతర వివరాలు నమోదుచేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి గణేశ్‌రెడ్డి తెలిపారు. మండలంలో గురువారం పర్యటించి పంట నష్టపోయిన రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంట నష్ట పోయిన రైతులు ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా పాస్‌బుక్, పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్ కాపీలు తీసుకు వచ్చి దగ్గరలోని రైతు సహాయ కేంద్రంలో వ్యవసాయ సహాయకునికి నిర్ణీత గడువులోగా సమర్పించాలన్నారు.

కూచిపూడి : మొంథా తుఫాన్ ప్రభావం కారణంగా మొవ్వలో వ్యవసాయశాఖాధికారులు పర్యటించి పంట నష్టం అంచనాలు రూపొందిస్తున్నారు. రైతులు పొలాల్లో నీటిని బయటికి మళ్లించాలని తెలిపారు. పడిపోయిన వరి పైరును పైకి లేపి కట్టుకోవాలన్నారు. ధాన్యం రంగు మారకుండా, తెగుడు ముడత వ్యాపించకుండా నిరోధించటానికి ప్రొపికొనజోల్ మందును పిచికారి చేయాలన్నారు. పంటనష్టం అంచనాలను ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తున్నట్లు ఏవో సురేష్‌బాబు నాయక్ తెలిపారు.

గుడ్లవల్లేరు: మొంథా తుఫాన్ కారణంగా నేలకొరిగిన వరిచేలను మండల వ్యవసాయశాఖ అధికారి సునీల్ బృందం పరిశీలించారు. 33 శాతం కంటే ఎక్కువ పడిపోయిన చేలకు పంటనష్టానికి గుర్తైనట్లు అంచనా వేస్తున్నామని సునీల్ తెలిపారు. ఇప్పటివరకూ దాదాపు 2200 ఎకరాలను గుర్తించామని ఆయన చెప్పారు. కంకి తయారైన చేలే ఎక్కువగా పడిపోయాయని ఆయన తెలిపారు. మండలంలో ప్రతీ గ్రామంలోనూ వీఆర్‌వోలు, పంట నష్టాన్ని నమోదు చేస్తున్నారని సునీల్ తెలిపారు.

గుడివాడ రూరల్ : మొంథా తుఫాను అనంతరం పంట నష్టం అంచనాలు రూపొందించనున్నామని ఏడీఏ సూరపనేని కవిత అన్నారు. గురువారం శాస్త్రవేత్తలతో కలసి వ్యవసాయశాఖ సిబ్బంది పొలాలను పరిశీలించారు. 30 శాతంకుపైగా పంట నష్టం జరిగితే అంచనా రూపొందిస్తామని తెలిపారు. ఏవో అనంతలక్ష్మి, పాల్గొన్నారు.



విన్నకోటలో వరి కంకులను పరిశీలిస్తున్న సునీల్

వేంకటేశ్వరస్వామి పవిత్రోత్సవాలు నవంబరు 2నుంచి

గుడివాడ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి) : స్థానిక జగన్నాథపురంలో వేంచేసియున్న వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో నవంబరు 2వ తేదీ నుంచి 5వ తేదీ వరకు వార్షిక పవిత్రోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు దేవస్థాన కార్యనిర్వహణాధికారి కందుల వేణుగోపాలరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీత్రిదండి శ్రీమన్నారాయణ చిన్నజీయర్ స్వామి మంగళశాసనాలతో అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పవిత్రోత్సవ కార్యక్రమంలో పాల్గొనే వారు దేవస్థానంలో రూ.1,116లు చెల్లించి తన పేరు, గోత్ర నామములను నమోదు చేయించుకోవాలని కోరారు. నవంబరు 2వతేదీన పవిత్రోత్సవ కార్యక్రమం ప్రారంభమవుతుందని, 5వ తేదీవరకు పలు పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పవిత్రోత్సవాల్లో భక్తులు పాల్గొనాలని ఆలయ ఈవో గోపాలరావు కోరారు.

ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలి

● ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సత్యనారాయణ

పామర్రు, అక్టోబరు30 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో గ్రామాల్లో ప్రజలకు ఎక్కడ తాగునీటి సమస్యలు తలెత్తకుండా స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని ఆర్‌డబ్ల్యూఎస్ డివిజనల్ అధికారి వి.సత్యనారాయణ అన్నారు. పామర్రు గ్రామపంచాయతీ పరిధిలో తాగునీటి ఇబ్బందులెదుర్కొంటున్న బాపూజీపేట, ఇందిరా నగర్ కాలనీల్లో క్షేత్ర పర్యటనతోపాటు స్థానిక రక్షతనీటి ట్యాంకులను గురువారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాటర్ ట్యాంకులన్నీ ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచే విధంగా సచివాలయ ఇంజనీరింగ్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. వాటర్‌మెన్‌లు తాగునీటిని విధిగా శుద్ధిచేసి పరీక్షించిన తర్వాతనే నీటి సరాఫరా చేయాలన్నారు. ప్రజలకు తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం వహించినా, ప్రజలు రోగాలబారిన పడినా సంబంధిత గ్రామకార్యదర్శులు, ఇంజనీరింగ్ శాఖ అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. బాపూజీపేట, ఇందిరా నగర్‌తోపాటు ఇతర ప్రాంతాల్లో తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా శాశ్వత పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తాగునీటి పైపులైన్లు ఎక్కడా లీకులు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చిమటా హేమస్రవంతి, కార్యదర్శి అబ్దుల్ సలీం, ఇంజనీరింగ్ సహాయకులు సీహెచ్ నవీన్, పూజ, తనూజ, కాశీవిశ్వనాథ్, ఫణి తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందికి పలు సూచనలిస్తున్న డీఈ సత్యనారాయణ

వైభవంగా సత్యదేవుని ఆలయ శిఖర ప్రతిష్ఠ

గుడ్లవల్లేరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : గుడ్లవల్లేరులో వేంచేసియున్న శ్రీరమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయ శిఖర ప్రతిష్ఠా, సంప్రోక్షణ మహోత్సవాలు గురువారం రాత్రి వైభవంగా ప్రారంభమయ్యాయి. గోపూజ, ప్రార్థనా సుక్త పఠనము, విక్వక్సేన పూజ, పుణ్యాహవాచన, పంచ గవ్యారాధన, పంచగవ్య ప్రాసన, రక్షాబంధన, దీక్షా స్వీకరణ, వాస్తుపూజ, వాస్తు హోమం, అంకురార్పణ, కుంభ పూజ, నీరాజనం తదితర కార్యక్రమాలు యాజ్ఞీకులు ముత్తేవి శ్రీనివాసశశికాంత్, అర్చక స్వామి రొంపిచర్ల శ్రీనివాసాచార్యుల నేతృత్వంలో పూజలు నిర్వహించారు.

సత్యదేవుని ఆలయ పునఃప్రతిష్ఠ మహోత్సవాలకు పలువురు విరాళాలు అందజేశారు. కొసరాజు బాపయ్యచౌదరి, విజయ దంపతులు రూ. 102232 లు, ఈడ్పుగంటి ఉమామహేశ్వరరావు,రాధిక దంపతులు వారి కుమార్తెలు అల్లుడు రూ 102232లు, పోలవరపు వెంకటరావు,లలితపద్మలు ఒక లక్ష రూపాయిలు, ఆర్యవైశ్య సంఘం వారిచే రూ 306942లు, వల్లభనేని సుబ్బారావు, జానకమ్మల జ్ఞాపకార్థం వారి మనువళ్ళుమనవరాళ్ళు రూ50 వేలు, వల్లభనేని వెంకటసుబ్బారావు చౌదరి,ఈశ్వరి దంపతులు రూ 50వేలు, వడ్లమూడి విజయలక్ష్మి జ్ఞాపకార్థం వారి కుమారుడు వడ్లమూడి కృష్ణ రూ 90 వేలు, మరి కొందరు ప్రముఖులు, భక్తులు తమ విరాళాలను వల్లభనేని వెంకటరావుకు అందచేశారు. కార్యక్రమంలో యలమంచిలి రామకోటేశ్వరరావు,ఉమాశంకర్, రవికాంత్, నరేష్, సుబ్రహ్మణ్యం, జంగం మోహనరావు,పరందామయ్య పాల్గొన్నారు.



పుష్పాలతో అలంకరించిన సత్యదేవుని ఆలయం

బెల్టుషాపుల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి

● ఎంపీపీ పెయ్యేల ఆదాం

నందివాడ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో బెల్టుషాపుల నిర్వాహకులపై ఎక్సైజ్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని మండల ఎంపీపీ పెయ్యేల ఆదాం పేర్కొన్నారు. గురువారం మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ లైసెన్సు ఉన్న షాపులను పోలుకొండలో 24 గంటలు మద్యం అమ్మకాలు నిర్వహిస్తున్నారన్నారు. ఎక్సైజ్ అధికారులు ఉన్నా నామకార్థంగా వ్యవహరించటం తప్ప బెల్టుషాపులపై చర్యలు తీసుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. శంకరంపాడు సర్పంచ్ కైలే సుబ్బారావు మాట్లాడుతూ డ్రెయినేజీల్లో తూడు తొలలగించకుండానే కాంట్రాక్టర్లు బిల్లులు తీసుకుంటున్నారన్నారు. అనంతరం పెదవిరివాడ సర్పంచ్ గూడపాటి రజని మాట్లాడుతూ రామాపురం ప్రభుత్వ హాస్పటల్ డాక్టర్లు ఎప్పుడు హాస్పటల్‌కు రావట్లేదన్నారు. కనీసం మండల సర్వసభ్య సమావేశాలకు కూడా రావట్లేదన్నారు. తుమ్మలపల్లి సర్పంచ్ రాధాకృష్ణ, ఎంపీడీవో మల్లేశ్వరి, డీటీ కిషోర్, మండల ఉపాధ్యక్షుడు జయరాజు, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.



ఎక్సైజ్ అధికారిని ప్రశ్నిస్తున్న రామాపురం సర్పంచ్ సురేష్

అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు

● పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ దీప్తి

గుడివాడ రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తుఫాను అనంతరం అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున మొబైల్ మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు మోటూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ దీప్తి అన్నారు. గురువారం చిన్నవానిగూడెం, తట్టివర్రు గ్రామాల్లో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ప్రతీ గ్రామంలో సచివాలయం పరిధిలోని ఏఎన్‌ఎంలు బ్లీచింగ్ చల్లిస్తున్నామని తెలిపారు. మండల ప్రజలు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ముందు జాగ్రత్త చర్యలుగా అందరి వైద్య సిబ్బంది చేత సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఏఎన్‌ఎంలు ఇంటింటికి తిరిగి వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. తుఫాను వర్షాలు వెళ్లగానే అంటువ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎవరికైనా అనారోగ్య సమస్యలు కనిపిస్తే వైద్యసిబ్బందిని సంప్రదించాలని కోరారు. ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.



చిన్నవానిగూడెంలో రోగులను పరీక్షిస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి దీప్తి

తుఫాను బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి : ఆర్‌సీపీ

గుడివాడ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాను సహాయక శిబిరాల్లో ఉన్న బాధితులకు జీవో నెం. 114 ప్రకారం రూ.1,000ల తక్షణ సహాయం అందించాలని సీపీఎం మంల కార్యదర్శి ఆర్‌సీపీ రెడ్డి కోరారు. గురువారం స్థానిక సుందరయ్యభవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక ఎస్‌పీఎస్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఉంచిన 207మందికి తక్షణమే ఆర్థిక సహాయాన్ని, నిత్యావసర వస్తువులను అందించి రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని డిమండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు లంకా సురేంద్ర పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌సీపీ రెడ్డి

కూచిపూడి : మొవ్వ మండలంలోని ఏడు పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందిన వారు ఇళ్లకు వెళ్లేటప్పుడు మూడు వేల రూపాయల ఆర్థిక సాయంతోపాటు బియ్యం, నిత్యావసరాలు అందిస్తామని ప్రభుత్వం ప్రకటించి వారిని వట్టి చేతులతో ఇళ్లకు పంపటం బాధితులకు నిరాశ కలిగించిందని సీపీఎం మొవ్వ మండల కార్యదర్శి శీలం నారాయణరావు పేర్కొన్నారు. జీవో నెంబరు 114 ప్రకారం పునరావాస కేంద్రంలోని పేదవారికి ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సాయంతోపాటు నిత్యావసరాలు వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. తుఫాన్ పరిస్థితుల నేపథ్యంలో వారికి వారం రోజులపాటు ఎటువంటి పనులు దొరకని పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా మండల ప్రజానీకాన్ని రక్షించటంలో అధికారులు చేపట్టిన చర్యలను నారాయణరావు అభినందించారు.

ఈ రహదారిపై ప్రయాణం నరకం



కపిలేశ్వరపురంలో చెరువులను తలపిస్తున్న రహదారి

పమిడిముక్కల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మంటాడ- లంకపల్లి ఆర్‌అండ్‌బీ రోడ్డు కపిలేశ్వరపురం వద్ద ధ్వంసమై భారీ గోతులతో ప్రమాదకరంగా మారింది. దీంతో ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే వాహనదారులు సర్కస్ ఫీట్లు చేయక తప్పడం లేదు. దీనికితోడు కొద్దిపాటి వర్షానికే రహదారిపై ఏర్పడిన గోతుల్లో వర్షపు నీరు నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. దీంతో ఏది రోడ్డో.. ఏది గోతో తెలియక వాహనదారులు నిత్యం రోడ్డు ప్రమాదాల భారిన పడక తప్పడం లేదు. మంటాడ వైపునుండి కూచిపూడి, లంకపల్లి, శ్రీకాకుళం పరిసర గ్రామాలకు వెళ్లే వాహనాలు, ఆర్టీసీ బస్సులతో పాటు లంకపల్లి ఇసుక క్వారీకి వెళ్లే పెద్ద టిప్పర్లు, ట్రాక్టర్లతో అనునిత్యం రద్దీగా ఉండే రోడ్డు గుంతలమయంగా తయారవడంతో ఆయా గ్రామాలకు వెళ్లేవారు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టిసారించి రోడ్డు అభివృద్ధిచేయాలని స్థానికులు కోరుతున్నారు.



భారీ గోతులతో మంటాడ రహదారి

పశువుల దొడ్డి కాదు .. సిమెంటు రోడ్డే

● దోమలతో అల్లాడుతున్న ప్రజలు
● రొయ్యూరు పంచాయతీ చర్యలు శూన్యం

(తోట్లవల్లూరు - ఆంధ్రజ్యోతి) : స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర అంటున్న అధికారులు లక్షలు ఖర్చుచేసి నిర్మించిన సిమెంటు రోడ్డు పశువుల కొట్టంగా తయారై రోగాలను కలుగజేస్తున్నా పట్టించుకోని వైనమిది. రొయ్యూరు గ్రామ పంచాయతీ పక్కగా పశువుల వైద్యశాలకు వెళ్లే సిమెంటు రోడ్డులో ఈ దుస్థితి నెలకొంది. ఓ వ్యక్తి సిమెంటు రోడ్డుపై వరకు ఇసుక, బుసకతో మెరక తోలి దానిపై గేదెలను కట్టేస్తున్నాడు. దీంతో పశువుల మూత్రం, పేడ రోడ్డుపైకి చేరి అడుగు పెట్టలేని విధంగా తయారయిందని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మురుగు నల్లగా తయారై రోజుల తరబడి ఉండటంతో దోమల విపరీతంగా పుట్టుకొస్తున్నాయని, దీంతో జ్వరాల బారిన పడుతున్నామని స్థానికుల నుంచి విమర్శలు వినవస్తున్నాయి. పంచాయతీ రోడ్డుని ఈ విధంగా ఆక్రమించి ప్రజలకు ఉపయోగపడకుండా చేయటంతో పాటు రోగాలకు నిలయంగా మార్చినప్పటికీ పంచాయతీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా వదిలేసిందని ప్రజలు ఆరోపించారు. స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర అంటు ప్రచారం చేస్తున్న అధికారులు ఇలాంటి అంశాలను గాలికి వదిలేస్తే ఎలా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రంచాయతీ కార్యాలయానికి వంద మీటర్ల దూరంలోని రోడ్డు ఈ విధంగా తయారైనా అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించటం సరికాదని ప్రజలు ఆగ్రహం వక్యక్తం చేస్తున్నారు.



రొయ్యూరు పంచాయతీ రోడ్డుపై మెరక తోలి కట్టేసిన పశువులు

రోడ్డుపై గేదెలను కట్టెయ్యొద్దు

గేదెలను రోడ్డుపైకి కట్టేయవద్దని సదరు వ్యక్తికి తెలియజేశాం. రోడ్డు పల్లంగా ఉండటంతో మురుగు నీల్వ ఉంటుంది. రోడ్డుపైకి మురుగు రాకుండా చూడాలని సూచించాం. సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతాం

ఎం కృష్ణమోహన్ , పంచాయతీ కార్యదర్శి

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	135, 144, 155
చికెన్ విత్ స్కిన్	260
చికెన్ స్కిన్‌లెస్	270

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 575

ఘనంగా డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ పుట్టినరోజు వేడుక



మచిలీపట్నం టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ జన్మదిన వేడుక గురువారం ఘనంగా జరిపారు. బండి రామకృష్ణ కేకు కట్ చేశారు. పేదలకు అన్నదానం జరిపారు. జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు, జనసేన కార్పొరేటర్ పినిశెట్టి చాయాదేవి, న్యాయవాది లంకిశెట్టి బాలాజీ, కొట్టె వెంకట్రావు, మాదివాడ రాము తదితరులు బండి రామకృష్ణకు పుష్పగుచ్చాలు ఇచ్చి అభినందనలు తెలిపారు.

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దివి పర్యటన దృశ్యాలు



పంట నష్టంపై ఫొటో ఎగ్జిబిషన్‌ను శ్రద్ధగా తిలకిస్తూ..



మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద ప్రజలకు అభివాదం



కోడూరు మండలం కృష్ణాపురంలో రైతుల గోడు వింటూ..



పులిగడ్డలో కొబ్బరి బొండాలు విక్రయిస్తున్న మహిళ సమస్యలు తెలుసుకుంటూ..



అవనిగడ్డలో గ్రీన్ అంబాసిడర్లతో..



భర్తను కోల్పోయిన గొర్రె నాగసూరిని పరామర్శిస్తూ...

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

చల్లపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.వి. ప్రసాద్ డిమాండ్ చేశారు. మొంథా తుఫాను కారణంగా దివి ఏరియాలో దెబ్బతిన్న పంటలను గురువారం రైతుసంఘం, సీపీఐ ఆధ్వర్యంలో రైతులతో కలిసి పరిశీలించారు. రాముడుపాలెంలో విరిగిపడిన అరటితోటలను పరిశీలించి రైతుల కష్టాలు అడిగి తెలుసుకున్నారు. రైతుల ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు వివరించారు. వరి పంటలకు ఎకరాకు రూ.30 వేలు, వాణిజ్య పంటలకు రూ.50 వేలు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌బాబు మాట్లాడుతూ, అందరికీ అన్నం పెట్టే రైతన్న ఆపదలో ఉన్నప్పుడు ప్రభుత్వం ఉదారంగా స్పందించాలన్నారు. పంటనష్టం పరిశీలించేందుకు కోడూరు వచ్చిన ఉపముఖ్యమంత్రి రైతులకు ఎలాంటి భరోసా ఇవ్వకుండా వెళ్లిపోయారని విమర్శించారు. అధికారులు పంటనష్టాన్ని నిష్పక్షపాతంగా అంచనాలు తయారుచేసి రైతులను ఆదుకోవాలని కోరారు. రైతుసంఘం రాష్ట్ర నాయకులు హనుమానుల సురేంద్రనాద్ బెనర్జీ, నేతలు వేమూరి రత్నగిరిరావు, మల్లుపెద్ది బోసు, సీపీఐ నేతలు కొల్లూరి శ్రీధర్, దాసరి గోపాలకృష్ణ రైతులు పాల్గొన్నారు.

శ్రీకాకుళంలో పర్యటన

ఘంటసాల : తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులను పూర్తిస్థాయిలో ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కె.వి.వి.ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శ్రీకాకుళంలో దెబ్బతిన్న వరి పంటను రైతుసంఘ నేతలతో కలసి ప్రసాద్ గురువారం పరిశీలించారు. సంఘ నాయకులు అడ్డాడ ప్రసాద్, హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, వేమూరి రత్నగిరిరావు, కోడి రాధాకృష్ణ, కోడి శ్రీనివాసరావు, కొల్లూరు శ్రీధర్, గోగినేని రత్తయ్య, చంటి, రైతులు పాల్గొన్నారు. నష్టపోయిన పంటల అంచనాలు వేసే బృందంలో రైతులు, కౌలు రైతులను ప్రతినిధులుగా చేర్చాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొత్తపల్లి, తాడేపల్లి, ఘంటసాలపాలెం గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. వాకా రామచంద్రరావు, మేడంకి వెంకటేశ్వరరావు, జి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



రాముడుపాలెంలో అరటితోటను పరిశీలిస్తున్న రైతు సంఘం నేతలు

బాధితులకు సీపీఎం పరామర్శ

మచిలీపట్నం టౌన్ : సహాయ శిబిరాల్లో ఉన్న వారికి రూ. 3వేల ఆర్థిక సాయంతో పాటు 25 కిలోల బియ్యం అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై. నరసింహారావు డిమాండ్ చేశారు. గిలకలదిండి, గరాలదిబ్బ ప్రాంతాల్లోని సహాయ శిబిరాల్లో ఉన్న ప్రజలను పరామర్శించారు. సీపీఎం నాయకులు బి. సుబ్రహ్మణ్యం, సిహెచ్ జయరావు, ఎం. పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

గూడూరులో ఉప్పాల పర్యటన

గూడూరు : పంటలు దెబ్బతిన్న రైతులకు ప్రభుత్వం తక్షణ సాయం అందించాలనినియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి ఉప్పాల డిమాండ్ చేశారు. దెబ్బతిన్న పంటలను ఆయన సందదర్శించారు.

రైతులకు అండగా ఉంటాం : ఎమ్మెల్యే కాగిత

కృత్తివెన్ను, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటుందని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ భరోసా ఇచ్చారు. మొంథా తుపాను ప్రభావంతో నష్టపోయిన బాధితులను గురువారం ఆయన పరామర్శించారు. విద్యుత్ పునరుద్ధరణ పనులు యుద్ధప్రాతిపదికన జరగాలని అధికారులకు ఆదేశించారు. పోడు, పడతడిక, గరిశపూడి, ధోమలగొంది, నిడమర్రు గ్రామాల్లో పర్యటించి, బాధితులకు ధైర్యం చెప్పారు. మార్కెట్ యార్డు చైర్మన్ ఒడుగు తులసీరావు, టీడీపీ మండల అధ్యక్షులు నాగిడి చెన్నకేశవరావు, కార్యదర్శి యాదంరెడ్డి కొండ, బస్వాని బంగార్రాజు, బొర్రా ఏడుకొండలు, చేకూరి వెంకట్రావు, అల్లూరి సత్యనారాయణ పాల్గొన్నారు.

డ్రెయిన్ పూడికతీత పనులు ప్రారంభం



బంటుమిల్లి : పెదతుమ్మిడి మేజర్ డ్రెయిన్‌లో పూడికతీత పనులను ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ గురువారం ప్రారంభించారు. డీసీ చైర్మన్ బొర్రా కాశీ, భూపతి రమేష్, ధన శ్రీరామూర్తి, రేవు గోపాలకృష్ణ, రత్న మోహన్, తహసీల్దార్ పూర్ణచంద్రరావు, ఆర్ఐ శంకర్, రైతులు పాల్గొన్నారు.

వాడపాలెంలో డీసీఎంఎస్ చైర్మన్ పర్యటన



మచిలీపట్నం టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) :బందరు మండలం వాడపాలెంలో ఇల్లు కోల్పోయిన బాధితురాలు సీతమ్మను గురువారం డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ పరామర్శించారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వ పక్షాన సాయం అందిస్తామన్నారు. అనంతరం బండి రామకృష్ణ చిన్నాపురం, నెలకుర్రు, వాడపాలెం, భోగిరెడ్డిపల్లి, పెదయాదర, తుమ్మలపాలెం గ్రామాల్లో పర్యటించారు. బండి రామకృష్ణతో పాటు గడ్డం రాజు, గల్లా తిమోతి ఉన్నారు.

పడిపోయిన వరిని నిలబెట్టాలి

గూడూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాను కారణంగా నేలవాలిన వరి పైరును రైతులు పైకిలేపి కట్టుకోవాలని వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డాక్టర్ కె. నాగేంద్రరావు, ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం. వెంకటలక్ష్మి, జె.యశ్వంత్ కుమార్ సూచించారు. వ్యవసాయాధికారులతో కలిసి మండలంలో పర్యటించి పంట పొలాలను పరిశీలించారు. ఎంటీయూ 1318, 1262, బీపీటీ 5204 వరి రకాలు పూత, పాలు పోసుకునే దశలో ఉన్నాయన్నారు. నిలబడి ఉన్న పొలాల్లో తాలు గింజలు ఏర్పడేందుకు అవకాశం ఉందన్నారు. ధాన్యం రంగు మారడం, మానిపండు, మాగుడు తెగుకుంల వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. నిలబడి, పడిపోయిన వరి పొలాల్లో గింజలు రంగుమారకుండా, తెగుళ్ల వ్యాప్తి నివారణకు ఎకరానికి 200మి.లీ చొప్పున ప్రొపికోనజోల్ పిచికారీ చేసుకోవాలన్నారు.

దెబ్బతిన్న పంటలను పరిశీలించిన వ్యవసాయ శాస్త్రవేత్తలు



బుద్దాలపాలెం, చెన్నూరులో వరిని పరిశీలించి సూచనలు చేస్తున్న వ్యవసాయ శాస్త్రవేతలు

మచిలీపట్నం టౌన్ : తుపాను కారణంగా నేలవాలిన పంట పొలాలను గురువారం వ్యవసాయ సహ పరిశోధనా సంచాలకులు డాక్టర్ ఎన్.వి.వి.ఎస్. దుర్గాప్రసాద్, డాక్టర్ ఏ.వి. రమణ, డాక్టర్ వి. సత్యప్రియలలిత, జె. యశ్వంత్‌కుమార్, రామ్‌కుమార్ పరిశీలించారు. బొర్రపోతుపాలెం, బుద్దాలపాలెం గ్రామాలలో నేలకొరిగిన వరి పొలాలను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. పెడన రూరల్, : మొంథా తుఫాను కారణంగా నేలకొరిగిన పంట పొలాలను వ్యవసాయాధికారులు గురువారం పరిశీలించారు. ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్ శారదా జయలక్ష్మిదేవి, విస్తరణ సంచాలకులు జి.శివరామకృష్ణ, మచిలీపట్నం కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త కె నాగేంద్రరావు తదితరులు పెడన, కట్లపల్లి గ్రామాలలో పంట పొలాలను పరిశీలించారు. ఏడు వేల ఎకరాలు గాలుల కారణంగా నేలకొరిగాయని మండల వ్యవసాయాధికారిణి ఎస్ జెన్నీ తెలిపారు. ఉరివి, చెన్నూరు గ్రామాలలో డ్రైనేజి సమస్యతో చేలలో నీరు నిలచి మునకకు గురయ్యాయన్నారు. పంట రక్షణకు రైతులకు సూచనలు చేశారు. డి.జ్యోతిరమణి, కె శ్రీనివాసరావు, యం.వెంకటలక్ష్మి, ఏవో జెన్నీ రైతులు పాల్గొన్నారు.



లక్ష్మీపురం బీసీ కాలనీలో సీసీ రహదారి నిర్మాణం

చల్లపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : లక్ష్మీపురం బీసీ కాలనీలో జిల్లా పరిషత్ నిధులు రూ.5 లక్షలతో సీసీ రహదారి నిర్మాణం గురువారం జరిగింది. చల్లపల్లి జడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి కల్యాణి రహదారి నిర్మాణపు పనులను ప్రారంభించి, పనులు పర్యవేక్షించారు. బీసీ కాలనీలో రహదారి నిర్మాణానికి కృషిచేసిన జడ్పీటీసీ దంపతులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. హెచ్ఆర్సీ రాష్ట్ర అధ్యక్షుడు రాజులపాటి శివప్రసాద్, మట్టా ప్రకాష్, బోలెం రంగారావు, బోలెం వెంకటేశ్వరరావు, రవి, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి అన్నాభిషేకం



చల్లపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : నిమ్మలతోట అయ్యప్పస్వామి క్షేత్రంలో మూలవిరాట్‌కు అన్నాభిషేకం చేశారు. దీక్షాపరులకు సద్ది కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. తొలిరోజు సద్దికి దిం టకుర్తి వెంకట మోహనరావు - శైలజ దంపతులు సహకారం అందించారు. 45 టేబుల్స్, 121 కుర్చీలు దాతల సహకారంతో కొనుగోలు చేశారు. ప్రముఖ పారిశ్రామికవేత్త కోనేరు మారుతీరావు, వారి తల్లి సరోజినీదేవి పాల్గొని సద్దిని ప్రారంభించారు. ఆలయ ధర్మకర్త అన్నవరపు పాండురంగారావు, మార్గాని చంద్రం గురుస్వామి, తుమ్మల వెంకటేశ్వరరావు, మునంగి శివ, తోట రాంబాబు, వై.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి శాంతి కల్యాణం

చల్లపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసంలో కోటి సోమవారంగా భావించే శ్రవణా నక్షత్రం సందర్భంగా గరుడ ఆంజనేయ సహిత వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి శాంతి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు బృందావనం ధన్వంతరాచార్యులు కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలుచేశారు.

తుఫాను ధాటికి 10 పడవలు ధ్వంసం



నాగాయలంక, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను ధాటికి నాగాయలంక పడవల రేవులో ఉన్న 10 మోటరైజ్డ్ పడవలు ధ్వంసమయ్యాయని ప్రాథమిక అంచనా చేసినట్లు మండల మత్స్యశాఖ అధికారి టి.సునీత తెలిపారు. మొత్తం 1020 పడవలు ఉండగా, అందులో 970 మోటరైజ్డ్ పడవలు, 50 సంప్రదాయ పడవలు ఉన్నాయని ఆమె తెలిపారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపుతున్నట్లు ఆమె తెలిపారు.

రైలు ఢీకొని గేదె మృతి

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : చిలకలపూడి రైల్వేస్టేషన్ వద్ద రైలు ఢీకొనడంతో గేదె మృతిచెందింది. కొంతసేపు రైలు నిలిచిపోయింది. రోడ్ల మీదే కాకుండా రైల్వేట్రాక్‌లపై కూడా మూగజీవులను యజమానులు వదిలేయడం వల్లే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయి.